కొండపల్లి ప్రచురణలు

రాధాబాయి

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు

వెల
రూపాయి

రాధబాబు

[కథల సంపుటి]

శ్రీ మునిమాణిక్యం నరసింహారావు బి. ఎ., యల్. టి.,

పబ్లిషర్సు :

కొండపల్లి వీరవెంకయ్యా అండ్ సన్సు

శ్రీ సత్యనారాయణ బుక్ డిపో,

రాజమండ్రి.

వెల
రూపాయి

ద్వితీయ ముద్రణ
నవంబరు 1958

శ్రీ కొండపల్లి ముద్రాశాల,
రాజమండ్రి.

1000
ప్రతులు

రాధబాబు

మీసాల చివరలు కొనపండ్లతో నొక్కిపట్టి, సిరాలో ముంచిన కలం చేత్తోపట్టుకొని, పక్కనున్న కిటికీలోనుంచి యథాలాపంగా, చూస్తూ కూర్చున్నాను. ఇంతలో దభేలు మని శబ్దం అయింది. గుండె గుభేలుమంది. భయం నా ముఖాన్ని అంతా కప్పివేసింది. కళ్ళు తేలిపోయినవి. అంత భయం నాకు ఎందుకు కలిగిందో నేను చెప్పలేను.

నాకు ఎదురుగానే మా పెద్దబ్బాయి, శాస్త్రికూర్చుని చదువుకొంటున్నాడు. వాడూ తెల్లపోయి చూచి "ఎవరో చేద బావిలో పడేసి వుంటారు" అన్నాడు.

ఎందుచేతనో ఆ మాట నాకు నిజమని తోచలేదు. తోచినట్లయితే నేను కుర్చీలోనుంచి ఎగిరిపడి లేవకపొయ్యే వాణ్ణే. లేచి ఒక్కగంతులో దొడ్లో బావిదగ్గరకు పరుగెత్తాను. శాస్త్రీ నా వెనకాలే పరుగెత్తుకొని వస్తూ, "ఇంకెవరున్నారూ ఆ దయ్యం, పాపే పడేసి వుంటుంది" అన్నాడు.

"వద్దేఅమ్మా, నీవు బావిదగ్గరకు పోబోకే" అని నెత్తిన నోరుపెట్టుకొని అరచినా అది వినక వీలైనప్పుడల్లా అది బావిదగ్గరకు పరుగెత్తుకెళ్ళి, ఎవ్వరూ లేకుండాచూచి భావిలో చేదవేస్తుంది. దాన్నిపైకిలాగలేక వదిలేసి వూరు

కొంటుంది. ఇల్లా అనేకసార్లు జరిగింది. అందుకనే వాడు అల్లాగ అన్నాడు.

బావిదగ్గర పాపా లేదు. ఎవ్వరూ లేరు. తెల్లపోయి చూస్తూనేవున్నాము. ఇంతలోకే వీధిలోనుంచి పాప, వంట యింట్లోనుంచి మా ఆవిడా పరుగెత్తుకొచ్చారు, "ఏమిటి, ఏమిటి ?" అంటూ, ఎటొచ్చి మాచినఅబ్బాయి రాధబాబు కనుపించ లేదు.

నేను బావిలోకి తొంగిచూద్దునుగదా ఆ చిన్నకుంక రాధబాబు నీళ్ళలో ఉక్కిరిబిక్కిరై తేలుతున్నాడు. "ఓరి బాబూ, ఓరి నాయినా అంటూ కేక వేశాము అంతానూ."

ఒడ్డున కేకవేస్తూ అంతా ఎగురుతున్నామేగాని చటుక్కున లోపలికి దిగి వాణ్ణి పైకిలాగాలని తోచలేదు. ఒక తాడు లోపలికి వెయ్యాలని తోచలేదు. ఏమీతోచలేదు. "చూస్తారేం, దిగండి" అని కేక వేసింది తల్లి. అప్పటికి నేను తెప్పరిల్లి వరలమీద కాలుపెట్టి దిగబోయాను. ఇంతలో రాధబాబు తేలి వరలు పట్టుకొని పైకి వస్తున్నాడు.

చిన్నసన్యాసి బిక్కముఖంతో గజగజ వణికి పోతు న్నాడు. "గట్టిగా పట్టుకో" "ఈ వరమీద కాలుపెట్టు" "జాగ్రత్త. జారుతుంది" అంటూ కేకలు పెట్టాము. నానాఅవస్థాపడి ఎట్లాగైతేనేం వాడు పైకి వచ్చాడు.

తల్లి వాణ్ని గబుక్కున దగ్గరకు లాక్కుని "ఏమిట్రా నాయనా, ఎందుకు దిగావురా బావిలోకి!" అంటూ తల తుడుస్తున్నది తన పమిటి చెంగుతో.

నాకు గుండెదడ తగ్గలేదు ఇంకా. "అసలు బావిలోకి ఎందుకు దిగాడో కనుక్కో?" అన్నాను పళ్ళు బిగపట్టి.

"కనుక్కుందాం లెండి. వణికిపోతున్నాడు. ఇంతవరకు మనం అదృష్టవంతులము. పండగ పూట కూడాను! చూశారూ ఎంతగండం తప్పిందో!" అంటూ ఆవిడ కొడుకును గట్టిగా కౌగలించుకొంది. వీడు అప్పుడే తల్లిని గట్టిగా కావిలించుకొన్నాడు.

వీడు బావిలో ఎల్లాగ పడివుంటాడూ అన్న సందేహం మాలో ఎవ్వరికీ లేదు. వాడికి బావిలో దిగటం అంటే సరదా. దానికోసం వాడు చిన్న నాటకము ఆడుతాడు. నీటిపైన తేలేవస్తువ ఏదైనా ఒకటి ముందు బావిలోకి గిరాటేస్తాడు. ఏదో డబ్బా, పుల్లా అట్లాంటిది. అది చెయి జారి బావిలో పడ్డదన్నమాట. దాన్ని బొంకెనతో తీయ టానికి కాసేపు ప్రయత్నం చేస్తాడు. అది రాదు. ఆపైన ఇహ బావిలోకి దిగడం అవసరము అవుతుంది. అప్పుడు వాడు దిగి ఒక పుల్లతో దాన్ని దగ్గరకు లాక్కొని, చేత్తో అందు కొని. అవళంగా పైకి వస్తాడు. ఈ మధ్య పాప అరుస్తునే ఉంటుంది. "దిగొద్దురా జారుతావేమోరా?" అని. వద్దు అంటూ వున్నపనిని నిర్భయముగా చేయడములో శౌర్య

సాహసాలు ప్రకటన అవుతయ్యని వాడికి తెలుసు. దాని తరువాత చీవాట్లు తగిలినాసరే. ఇల్లాగ ఒకసారిగాదు. అయిదారుసార్లు జరిగింది. ప్రతిసారీ చీవాట్లు వేస్తూనే వున్నాము. అల్లాంటి పనిచేయకురా, జారిపడ్డావా ప్రమాదంరా అంటూ. ఈసారి కాలుజారి పడివుంటాడు. భగవంతుడి దయవల్ల ప్రమాదము లేకుండా బైటపడ్డాడు.

"ఈ గండము గడిచింది. కాని వాడికి గట్టిగా బుద్ధి చెప్పకపోతే యింకా ఎందుకన్నా పనికివస్తాడా? బావిలోకి దిగాలిసినపని ఏమివచ్చిందో కనుక్కో వాడిని." అని నేను గట్టిగా, కోపముగా అంటూ వాడ్ని కొట్టబోయాను.

"మీరు కొంచెము వుండండి. అసలు సంగతి కనుక్కో నీయండి" అంటూ ఆవిడ నాకు అడ్డమువచ్చి, "ఎందుకు దిగావురా? దేనికోసము దిగావురా నాయనా బావిలోకి, పిచ్చిబాబూ" అంటూ ఆవిడ ఆనందబాష్పాలు కార్చింది. వాడు మాట్లాడకుండా తల్లికి అతుక్కుపోయాడు.

ఇటువంటి విషయాల్లో పాప సాయములేనిదే సాధారణముగా వాడు ఏపనీ చెయ్యడు. అది బావిలో ఏదో పడేసి వీడిని దిగమని ప్రోత్సహిస్తుంది.

"ఈ అల్లరిలో నీవు వున్నావే పాపా? బావిలో ఏం పడేశావు! దయ్యమా చెప్పు?" అని కేకలేశాను. "నేనేమీ యెరగను నాన్నా అసలు నేను ఇక్కడ లేను, అక్కడున్నాను దభీమని మ్రోతవిని పరుగెత్తుకొచ్చాను. నే నేమెరుగుదు

నేం ? అంతా నామీద పెడతారు.'' అంటూ బిక్క ముఖం పెట్టింది. బావిలోకి తొంగిచూస్తే, తేలుతూ వున్న వస్తువ ఏదీ అక్కడ కనుపించ లేదు.

వాళ్ళమ్మ యింకా వాడికి వళ్ళు తుడుస్తునేవుంది. ''నా తండ్రి. నాతండ్రి యెంతగండం తప్పిందిరా ? పండగపూట కూడాను ! ఎంత అదృష్టవంతులమురా ఇవ్వాళా'' అంటూ.

ఇంతకూ వాడు బావిలోకి ఎందుకు దిగాలిసొచ్చిందో తెలియ లేదు. అప్పటికి నాకు కొంచెము దడతగ్గింది. మళ్ళీ యిల్లాంటిపని ఎప్పటికి చెయ్యవద్దని, వాడికి గట్టిగా బుద్ధి చెప్పాలని అనుకొన్నాను. అందుకని ఒక సన్నని బెత్తము ఒకటి తీసుకొని వాడిదగ్గరకొచ్చి ''ఏం రా అసలు నీవు బావిలోకి ఎందుకు దిగాలిసి వచ్చిందో చెప్పు ?'' అన్నాను బాగా ఉరిమిచూస్తూ, బెత్తం విసురుగా ఆడిస్తూ కూడాను.

''కొట్టకండి పండగప్రూట''అన్నది వాళ్ళమ్మ.''కొట్టక ముద్దెట్టుకోమంటావాకొడుకునూ, ఇల్లాంటిపనిచేసినందుకూ? వాడిని వళ్ళుచీరేస్తాను. నీవు తప్పుకో.'' అని పైకి అంటూ నురేం చెయ్యను. ఊరికే కోప్పడతాను. నీవు అడ్డంరావద్దు అని అర్థంవచ్చేలాగున ఆమెకు కంటితో సంజ్ఞ చేశాను. ఆవిడ తప్పుకు వెళ్ళిపోయింది. ''తన్నండి వెధవనుఎప్పుడూ ఇల్లాంటి పని చెయ్యకుండా'' అని అంటూ.

రాధబాబు నిస్సహాయుడు అయిపోయినాడు. పాప కూడా ఎదురు తిరిగింది. వాడు ఎప్పుడూ దిగుతూనేఉంటాడు నాన్నా, పడతావురా అని నేను గోలపెట్టి ఏడ్చినా వినడు నాన్నా అని వాడి స్వభావాన్ని గురించి సాక్ష్యం చెప్పింది.

నేను బెత్తము బాగా పైకెత్తి "ఏంరా బావిలో ఎందుకు దిగావో చెప్పు, చెప్తావా కొట్టనా?" అని అడిగాను.

బాగా ఏడ్పుముఖం పెట్టి "నేను దిగలేదు నాన్నా" అన్నాడు. తల్లికూడా దగ్గర లేకపోవడము మూలాన ఆసరా ఎవ్వరూ లేరని తెలుసుకొని ఫెడేలుమని ఒకపెద్ద అబద్ధం ఆడేశాడు. అందుకని "ఎందుకురా అబద్ధము ఆడుతావ్రూ? దిగకపోతే బావిలోకి ఎల్లాగ వెళ్ళావ్రూ?" అని అడిగాను.

"అబద్ధాలు కాదు నాన్నా. నేను దిగలేదు." అన్నాడు మళ్ళా.

"మరేమిటి"

ఆ ప్రశ్నమీద రాధబాబు నిజంసంగతి చెప్తాననీ ఈ విధముగా చెప్పాడు.

"అదికాదు నాన్నా! బొక్కెనతో నీళ్ళు తోడు తున్నాను. అసలు నేను బొక్కెన సగానికి నీళ్ళు తీద్దామని అనుకొన్నాను. కాని ఏమైందిఅంటే అది గబుక్కున మునిగి నిండిపోయింది. చాలా బరువు నాన్నా అది. నేను లాగలేక పోయినాను" అని అక్కడ ఆగాడు.

"ఊఁ, లాగ లేకపోతే ? చెప్పు ఏమైందో" అన్నాను నేను కోపంగా, రాధబాబు జా అని ఏడ్చి ఏడుస్తూ నేలన్నాడు "అప్పుడే బాగా వంగి ఇట్లా లాగుతున్నాను నాన్నా. ఆప శంగా కాలుజారి తలక్రిందుగా పడిపోయాను నాన్నా."

మళ్ళీ పెద్దగా బావురుమన్నాడు.

వంగితేమటుకు పడిపోతారా ? అని నాకు సందేహము కలిగింది. గోడ అవతలవుండి, ఇదంతా వింటూన్న తల్లి తలుపు తోసుకొనివచ్చి పిల్లవాడ్ని కావిలించుకొని మా నాన్నే, తలక్రిందుగా పడ్డవురా నాన్నా ? ఎంతగండం తప్పిందో ! అంటూ వాడి వళ్ళంతా నిమిరి ముద్దెట్టుకొంది.

ఆటకోరుతనంగా బావిలో దిగి జారిపడటం కాదది. కాలుజారి పడ్డాడు. వాడితప్పు అందులో ఏమీలేదు. వాడ్ని యింకా కోప్పడటం అన్యాయం అని నాకు తోచింది. వాళ్ళమ్మ కూడా అల్లాగే అనుకొన్నది.

"అయితే దెబ్బతగల్లేదురా ?" అని అడిగాను నేను. అంతతల్లక్రిందుగా పడితే తలకాయ వరలకు కొట్టుకో వలసింది.

దీనికివాడేమీ సమాధానము చెప్పక ఊరుకొన్నాడు. "ఎందుకు తగులుతుందండీ ? నిటారున పడిపోయాడు" అని ఆమె సమాధానము చెప్పింది.

"అంతే అయియుంటుంది నాన్నా" అన్నది పాప.

2

అయితే మటుకు అసలు బొక్కెన బావిలోవేసి లాగా లిసినంత అవసరము వాడికేం కలిగింది ? నీళ్ళు కావాలంటే యింట్లో లేవు కనకనా ? అందుకని ఇటువంటి పిచ్చి పనులు ఎప్పుడు చెయ్యవుగదా అంటూ కొట్టబోయాను.

వాడు మళ్ళీ శాపురుమని ఏడ్చాడు. పాపం వాడితప్పు ఏముందండీ, కాలుజారి ఒరిగిపడిపోతేనూ ? అయినదానికీ కానిదానికీ కూడా దండిస్తే ఎల్లాగ ? పండగపూట పసి వాడ్ని అన్యాయముగా కొట్టేవారే. అంటూ వాడిని తల్లి దగ్గరకు తీసుకొని ఓదార్చింది.

నాకుమటుకు వాడిని అన్యాయముగా కొట్టానన్న విచారము కలుగలేదు. అసలు నీళ్ళు తోడటానికి ప్రయత్నము చేయడము ఒకతప్పు. రెండోది చేద అంత బరువేస్తే దాన్ని బావిలోకి వదిలేయాలె, అంతేగాని దానితోకూడా లోపలికి వెళ్ళడములో వాడికేదో కొంటెతనము ఉన్నట్లే నాకు అనుమానము.

వాడు తల్లిని కౌగలించుకొని ఇంకా ఏడుస్తూ ఉంటే నాకు మళ్ళా జాలివేసింది. పండగపూట కొట్టానే అని.

పెద్ద దయ్యంలాంటి బొక్కెనకొనుక్కొని వచ్చారు. నేనే లాగలేకపోతున్నాను. వాడికేం సాధ్యమౌతుంది. క్రిందికి గుంజేసింది కామాలు ఆ బొక్కెన? లేదులే నాన్నా ఇవ్వాళరోజు అటువంటిది ! ఏంజేస్తాం ? ఇకరారా నాన్నా వెళ్దాము అంటున్నది తల్లి.

నేనూ వెళ్ళ బోతున్నాను. ఇటు చూద్దునుగదా, అసలు ఆ బొక్కెన బావి పైనే ఉంది బండచాటున.

వాడు బొక్కెన లాగలేకపోయి పడితే, అది బైటే, ఎందుకు ఉంటుందీ? వాడు బ్రహ్మాండమైన అబద్ధం ఆడి అందరినీ నమ్మించాడు. వాళ్ళు ఎవ్వరూ బొక్కెన బైట ఉన్న సంగతి చూడలేదు. తల్లి అంటున్నది, "నాన్నా ఎప్పుడూ బావిదగ్గరకు వచ్చి ఇట్లాంటి పనులు చేయకేం" అని. నేను "ఏంజేశానే? బావిలో దిగానా ఏమన్నానా? కాలుజారి ఇట్లాం ఢాం అని పడిపోయానే" అంటున్నాడు వాడు. ఈ మాటలు వింటూంటే పాపం ఆతల్లికి కళ్ళనీళ్ళ పర్యంతం అవుతున్నది.

చిన్నవాడైనా అబద్ధాలు ఆడటం బాగానేర్చినట్లుంది. ఎక్కడా జంకూగొంకూ కనపడటంలేదు. నిజంచెప్పేస్తున్నట్లే మాట్లాడుతున్నాడు ఏడ్పుముఖము పెట్టి. నాకు వళ్ళు మండి పోయింది ఈ దొంగతనంచూచి.

చివరకు నేనన్నాను, "అయితే రాధబాబూ బొక్కెన లాగబోయి పడ్డావుకదా, బొక్కెన ఏమైందిరా?" అని. "బావిలో పడ్డది" అని ఠపీమని జవాబు చెప్పాడు తడుముకో కుండా. "మునిగిపోయిందా, తేలిందా?" అని అడిగాను నేను. వాడు తెల్లపోయి నా వంకచూచి, "ఎక్కడన్నా తేలుతుందా ఏమిటి?" అన్నాడు.

"అయితే, ఇదేమిటిరా ? బావిలో ఉండాలిసిన బొక్కెన పైన ఎందుకు ఉందీ ? చెప్పవేంరా ? అని అడిగాను కళ్ళు ఉరిమిచూస్తూ.

అంతా తెల్లపోయినారు, వాడూ తెల్లపోయినాడు. వాడు ఇందాకటినుండీ అల్లుకొచ్చిన కథ అంతా టఫీన ఎగిరి పోయింది. పత్తిగాలిపోగుచేసి కథ అల్లాడు. అంతా నమ్మానము కూడాను. వాడు చెప్పినదంతా పచ్చి అబద్ధాలు అని అందరికీ తెలిసింది. ఒక్కసారి అంతా నవ్వారు ఫక్కున.

రాధబాబు ముఖం మరీ తెల్లబడ్డది. కథ అడ్డంగా తిరిగిందని వాడికీ తెలిసింది కాబోలు బిత్తరపోయినాడు.

"కొడతారని భయపడి అబద్ధం ఆడాడు లెండి." అంటూ తల్లి వాడిని సమర్థించింది. బొక్కెనకూడా బావిలోకి గిరాటువేసినట్లు, అయితే, వాడు ఆడినఅబద్ధం అభేద్యం అయ్యేది. ఆ బొక్కెన కాస్తా బైట ఉండబట్టి అంతా బట్టబయలు అయి వాడు అబద్ధం ఆడుతున్నాడని తెలిసింది.

నాకుమటుకు చెడ్డకోపంగా ఉంది. వీడు ఇంత అబద్ధం ఆడాడే అని. ఒక వేపబెత్తము తీసుకొని "వళ్ళు చీరేస్తాను. ఎందుకు ఇంత అబద్ధంఆడావు ?" అన్నాను నేను కోపంగా.

"నేను అబద్ధం ఆడలేదు నాన్నా" అని వాడు మళ్ళీ అన్నాడు.

"అబద్ధం ఆడటంలేదు ? ఓరి కొంటెసన్యాసి, ఇంకా బొక్కెన బరువై లాగలేకే పడ్డానూ అంటావూ ? ఇంకా

అల్లాగే అంటావా ?'' అని గర్జించినా, వాడు భయపడక 'అవును నాన్నా' అన్నాడు. నిజానికి కట్టుబడ్డవాడిలాగ చూస్తూ.

ఇంత గట్టిగా రెట్టిస్తున్నాడు. వీడిని ఏంజేసినా పాపం లేదు, అనుకొన్నాను.

అయితే బొక్కెన బావిలో ఉండాల్సింది బైటకెల్లాగు వచ్చిందిరా ? అని అడిగాను.

''ఏమో ఎట్లాగొచ్చిందో'' అన్నాడు. ఏమంటాడు అంతకంటే. వాడనటం బొక్కెనకు కాళ్ళొచ్చి అదంతట అదే బైటికొచ్చిందని.

ఇదివరలో మాయింట్లో గాజుగ్లాసులూ, చిమ్నీలూ వాటంతట అవే పగులుతుండేవి. సిరాబుడ్లు బల్లమీద వాటంతటఅవే వలికిపోతుండేవి. సిరా అంతా పుస్తకాల మీద పడ్డతరువాత ఆబుడ్లు మళ్ళీ వాటంతటఅవే లేచి స్వస్థానములో ఉంటూఉండేవి.

మంచినీళ్ళలోకి బొగ్గులు వాటంతటఅవే వచ్చి పడి తేలుతూ ఉండేవి. ఇటువంటి గారడీలు చెయ్యటం మావాడికి బాగా తెలుసు. అల్లాగే బొక్కెన కూడా దానంతటఅదే బావిలోనుంచి ఎగిరి బైటకొచ్చి కూర్చున్నది అన్నమాట ?

ఇటువంటి అబద్ధాలు ఆడినందుకు సరియైన శిక్ష విధించకపోతే వీడు ఎందుకూ పనికిరాకుండాపోతాడు. అంటూ ఆ వేపపుడకతో ఒక్కటి వేశాను.

వాడు బిక్కముఖముతో నన్ను చూచి ఏడ్చాడు, తల్లి వాడిని తన చాటుకు తీసికొని లోపలకు తీసుకుపోయింది.

నేనింకా అక్కడే నుంచున్నాను. వాడు ఇంతకూ నిజం ఒప్పుకోలేదు. ఆపళంగా వాడ్ని వదిలేస్తే ఏమైనట్లు? ఇంకా రెండు తగిలిస్తేగాని నిజం ఒప్పుకోడు. తగిలిన రెండు దెబ్బలూ ఏమంత గట్టివీ కావు.

పసితనంలో ఏదో అబద్ధం ఆడాడులే అని సరిపెట్టుకొని ఊరుకుంటే, వాడు యింకా అబద్ధాలు ఆడటం నేర్చుకొంటాడు. వాడిచేత నిజం చెప్పించి, అబద్ధం ఆడితే లాభం లేదనీ, నిజం దాగదనీ, వాడు తెలుసుకొనేటట్లు చెయ్యాలి.

అదీగాక తాను చెప్పినదంతా వట్టి అబద్ధం అని బైట పడ్డా ఇంకా దబాయిస్తున్నాడు. నీవు చెప్పిందే నిజమైతే బొక్కెన బైట ఎల్లాఉందిరా? అని అడిగితే 'ఏమో ఎట్లా ఉందో' అనటం దబాయింపుగాక మరేమిటి?

చేసినతప్పును కప్పిపుచ్చటానికి ఒక అబద్ధం ఆడటం! దానికిపోటీ ఇంకో అబద్ధం! ఆ రెండూకూడా నిలబడలేకపోతే డబాయింపు! ఇల్లాంటి ప్రవర్తన అలవాటైతే ఇంకేమన్నా ఉందా?

అని నేను ఇల్లాగ చాలసేపు ఆలోచించుకొని ఏమైనా కానీ, వీడిచేత ఇవ్వాళ నిజం చెప్పించాలె. సత్యాన్ని వాడి నోటితోనే పలికించాలె. బెదరించిచూస్తాను. నిజం ఒప్పుకొన్నాడా సరేసరి, బెదిరింపులకు లొంగకపోతే ఇంకా రెండు గట్టిదెబ్బలు వెయ్యటానికికూడా సందేహించకూడదు. తండ్రి అయినవాడు చెయ్యాలిసిన విధి ఇది. అని నిశ్చయించుకొని ఇంట్లోకి వెళ్ళాను.

నా నిశ్చయం నా నడకలోకి నా ముఖంలోకి నా చూపుల్లోకి పాకింది. రాధబాబుకు కొత్త చొక్కా తొడుగుతున్న తల్లే నన్ను చూచి బిత్తరపోయింది. కోపాన్ని కక్కుతున్న నా కళ్ళనూ, బిగబట్టిన పళ్ళనూ చూచి రాధబాబు గజగజ వణికిపోయాడు.

నేను వాడిదగ్గరకెళ్ళి అన్నాను "ఒరేయ్! నీవు అబద్ధంఆడావు. నీవు అబద్ధాలుఆడావని వీళ్ళందరికీ తెలుసు!" అని మా ఆవిడవంక తిరిగి ఏమే నీవు అబద్ధం ఆడుతున్నాడంటావా ? లేదంటావా ? అని అడిగాను మండిపోతూ.

"ఆఁ అబద్ధంకాక నిజం చెప్పాడని ఎవరంటున్నారు ? పసివాడు కాబట్టి క్షమించి ఇంతటితో పోనీయమంటున్నాను" అన్నది.

"అబద్ధం ఆడానని ఒప్పుకోమను వాడిని. ఒప్పుకొని ఇంక ఎప్పుడూ అబద్ధం అనేది నోట రానీయనూ అంటే క్షమించి ఊరుకొంటాను, లేదో ఇవ్వాళ వాడి వళ్ళు

పగిలించే'' అంటూ మా ఆవిడను కెక్కుచ్చుకొని వాడిదగ్గర నుంచి అవతలకు లాగేసి బెత్తం పైకెత్తాను.

పిల్లవాడ్ని బాగుచేసి మంచిమార్గానికి త్రిప్పి సత్పథంలో పెట్టాలన్న ఆవేశమే నాకు తాత్కాలికంగా కోపాన్ని తెచ్చిపెట్టింది. కొట్టటానికి సిద్ధం అయినాను

నేను బెత్తం పైకెత్తేసరికి పాప కెవ్వున కేక పెట్టి ఏడ్చింది. హడలిపోయి నాఉగ్రంజూచి, అడ్డం రావటానికి సాహసించలేక మా అవిడ కూడా దిగులుముఖంతో కొడుకు వంక చూసింది.

ఇక రాధబాబు సంగతి చెప్పనక్కరలేదు. నోట మాట రాలేదు. నిశ్చేష్టుడైపోయి, కళ్ళనీళ్ళు కారుస్తూ నించున్నాడు.

నేను ఎత్తిన బెత్తం ఎత్తినట్లేఉంచి, ''ఏంరా అబద్ధం ఆడావా?'' అని ఒక పెద్దరంకె పెట్టాను. వాడు వణికిపోతూ అవునన్నట్లు తలఊపాడు.

''బావిలో దిగాలని దిగావు కదూ ?''

''అవును''

''దేనికోసం దిగావు?''

''ఊరికేనే.''

''సరదాకా ?''

"ఆ."

"ఇంకెప్పుడూ అల్లాగ దిగవుకదా ?"

"దిగను."

"ఇంకెప్పుడూ అబద్ధాలు ఆడవుకద ?"

"ఆడను."

"ఇంకోమారు అబద్ధం ఆడావంటె, కొట్టేస్తాను తెలిసిందా?"

"ఆ."

నిజం ఒప్పుకొన్నాడు. ఇహ వాడిని ఒదిలేయాలనుకొన్నాను. ఆ సమయానే తల్లి వచ్చి కొడుకుని రెండుచేతుల్లోకి తీసుకొని, ఇహ వెళ్ళండి నిజం చెప్పాడుగా. "ఇహ ఎప్పటికీ అబద్ధంకూడా చెప్పడు." అంటూ వాడిని వంట ఇంట్లోకి లాక్కెళ్ళింది.

పాప వచ్చి నేను గోడకు ఆనించిపెట్టిన బెత్తాన్ని తీసుకొని ముక్కలుముక్కలుచేసి పారేసింది. "నిజం చెప్పబట్టి సరిపోయింది, లేకపోతే నాన్న ఆ కోపంలో పాపం వాడ్ని బాదేసిఉంసురు." అంటున్నాడు శాస్త్రి వాళ్ళమ్మతో.

నాకు చాలాసంతోషం కలిగింది చెయ్యి చేసుకోకుండానే వాడిచేత నిజం ఒప్పించగలిగినందుకు. వాడిని పండగపూట ఏడిపించానే అని జాలికూడా వేసింది. ఇంతకూ ఏంజేసినా వాడి బాగుకోరే గదా చేసింది అని నాకు నేనే సమాధానము చెప్పుకొన్నాను.

"నిజంఒప్పుకొన్నాడు. అదేసంతోషం" అనుకొంటూ దొడ్లోకి వెళ్ళాను. మా ఇంటిప్రక్క ఆవిడ అక్కడ బావి దగ్గర దేనికోసమో అటు ఇటూ చూస్తున్నది. కాసేపు నేను అక్కడే నుంచున్నాను, జామచెట్టువంక చూస్తూ. ఆవిడ బావికి నాలుగుప్రక్కలా దేనికోసమో వెతికింది. కన పడ లేదు కామాలు. అయోమయంగా చూస్తూ లోపలికెళ్ళి వంటయింటి గుమ్మంలోనుంచుని అడుగుతున్నది మా ఆవిడను "ఏమమ్మా కాంతమ్మ ఒదినే చేద కనపడదేం?" అని.

"బావిదగ్గరనే ఉందమ్మా చేదా" అన్నది మా ఆవిడ. "అది మీ బొక్కెనమ్మా, మాబొక్కెన ఒకటి ఉండాలె. ఇందాకా తెచ్చి ఒక బిందెడు నీళ్ళుతోడుకెళ్ళి మళ్ళీ ఇంకో బిందెడు ఎల్లాగూ రావాలె గదా అని ఇక్కడే పెట్టి వెళ్ళాను. అంతా మీ దానిమోస్తరే ఉంటుందిలే. ఒకవేళ అదే మీది అనుకొని ఇంట్లో పెట్టావేమోఅని అడుగుతున్నాను" అన్నది ఆవిడ.

ఈ మాటలు నా చెవినిబడ్డయి. ఒళ్లు ఝల్లుమంది. వీపుపైన ఛెళ్లున కొట్టినట్లు అయింది.

ఇంతలో మాఆవిడ వంటయింట్లోనుంచి ఒక్కగంతులో దొడ్లోకి వచ్చి, నావంక చురచురా చూస్తూ అడిగింది.

"విన్నారా ?"

"ఏమిటి ?" అన్నాను నేను ఏమీ ఎరగనట్టు."

"ఏమిటి ? వదినగారు చేద ఇక్కడ వదిలేసిపోయింది. రాధబాబు దాన్నే బావిలో పడేసి ఉంటాడు."

"అంతే అయిఉంటుంది" అన్నాను నేన చమత్కారంగా. "ఎంత నిర్లక్ష్యంగా అన్నారండీ? రాతి గుండెమీది. నేను మొట్టమొదటినుండీ మొత్తుకుంటూనే ఉన్నా వాడి నేమీ అనకండి అని, నిజం ఒప్పిస్తా నిజం ఒప్పిస్తానంటూ, అంతెత్తు లేస్తిరి. నోరెత్తితే నామీద ఎక్కడ విరుచుకు పడతారో అని నోరు నొక్కుకొని ఊరుకొన్నాను. చెప్పించారు! నిజం !" అని ఈసడిస్తూ కళ్ళ నీళ్ళు తుడుచుకొంది.

"ఏం జేశానూ ?" అన్నాను నేను క్రుంగిపోతూ.

"ఏంజేశారా ? ఏమీ ఎరగని అమాయకపు చిన్న సన్యాసికి అబద్ధం ఆడడం నేర్పారు." అని మరోసారి కళ్ళు ఒత్తుకొని వెళ్ళిపోయింది.

క్రుంగిపోయి, నీరసంగా, దిగులుగా పశ్చాత్తాపముతో నిలబడిపోయినాను.

బోట్ హౌస్

మా ఆవిడ పిల్లలను తీసుకొని పుట్టింటికెళ్ళింది. మళ్ళీ పదిరోజులలో తిరిగి వస్తానన్నది. పదిరోజుల భాగ్యానికి హోటల్లో చేరటం ఎందుకని నేనే చెయ్యి కాల్చు కుంటు న్నాను.

మా ఆవిడ వెళ్ళిన మరునాడే మా మేనత్త వచ్చింది. చాలా రోజులైన తరువాత మా అత్తను చూచానన్నే కాకుండా, ఈపదిరోజులూ, చెయ్యికాల్చుకోకుండాపోతుంది గదా అని నేను ఎంతో సంతోషించాను.

కాని వచ్చినరోజు సాయంత్రమే ఆవిడ అన్నది.''రేపు ప్రొద్దున బండికి నేను వెళ్ళుతానాయినా''అని.''ఏమమ్మా అప్పుడే వెళ్ళటం ఏమిటి? ఏం రావటం! ఏం పోవటం! మీ కూతురూ పిల్లలూ రెండుమూడు రోజులలో వస్తారు. ఉండి పిల్లను చూచిపో'' అన్నాను.

''కాదులే నాయినా తొందరపని ఉంది. నేను రావ టమే, అసలు ఓ అర్జంటుపనిమీద వచ్చాను. అసలు నేను కదలేదాన్నా!

ముసలాయనకు వంట్లో ఏమీ బాగుండలేదు. ఆయ నకు పథ్యం పానం నేను చేసిపెట్టాలిసిందేగాని కోడలుకేమీ

తెలియదు. అదీగాక దానికి నిండు నీళ్ళాడ పొద్దులూ! ఇవ్వాళా రేపో అనుకుంటున్నాము. నన్ను బలవంత పెట్టక వెళ్ళనియ్యి'' అన్నది.

''అల్లాంటప్పుడు నీవు ఇల్లు కదలవలసిన అవసరమేమి వచ్చిందమ్మా'' అని అడిగాను. ''ఏంజేసేది నాయినా? ఆ నాంచారమ్మ, ఒక్క తీరాన కళ్ళా గడ్డం పట్టుకొని బ్రతిమిలాడి పంపింది.''

''ఎందుకూ?''

''అదో గొడవ ఉందిలే! ఈవూళ్ళో ఓ మంచిభూత వైద్యుడున్నాడు. ఆయన్ను తీసికెళ్ళటానికే వచ్చాను. రేపు ప్రొద్దుటి బండికే ఆయనా వస్తాడు. ఇద్దరం కలిసే వెడతాము.''

''భూతవైద్యుడు? అయితే ఏదో గాలి సోకిందా ఏమిటి ఆమెకూ?''

''అవునురా నాయినా, మన ఇంటిప్రక్కనేగా వాళ్ళ ఇల్లు! ఆ ఇంట్లో ఒక దయ్యం ప్రవేశించింది!''

దయ్యాలయందు నాకు అట్టే నమ్మకంలేదు. అందుకని హేళనగా మాట్లాడాను. ''దయ్యం! దయ్యం ఎట్లా ప్రవేశించిందమ్మా'' అని.

''ఎట్లాగో, దయ్యాలు వచ్చేదారులేవో మనం చెప్పగల్గుమా! ఎట్లాగో ప్రవేశించింది'' అన్నది ఆవిడ.

"ఎవ్వరూ చూడలేదు అన్నమాట!"

"ఎట్లాచూస్తారురా? అయినా చూస్తుండంగావస్తుందా దయ్యం ?"

"అయితేనోంగదయ్యంఅన్నమాట" అన్నాను నేను. మా అత్తయ్య ఈ పిచ్చి మాటలు విని విసుక్కొని ఊరు కొన్నది. కాని నాకు ఆదయ్యం ఎల్లాంటిదో ఏమిటో తెలుసు కోవాలెనని ఉండటం వల్ల "ప్రవేశించి ఏంజేసేదమ్మా" అని అడిగాను.

"ఎందుకూ చెపటం ? నీవు అంతా వట్టిదే అంటావు ఈ ఇంగ్లీషు చదువుకొన్న వాళ్ళందరికీ ఇదొకటి ! దయ్యా లంటే నమ్మకం లేదు."

"నమ్మకం లేక పోవటానికి కారణం ఏమిటంటే దయ్యాన్ని నేను చూశాను. అని చెప్పగలవాళ్ళు నాకెవ్వరూ ఇంతవరకు కనపడలేదు."

"అయితే అబ్బాయీ కనపడటానికి వీలులేని వస్తువ ఎల్లాగ కనపడుతుందిరా ? నీకు గాలి కనపడుతుందా ? దయ్యమూ గాలే, కాబట్టి అది మన కళ్ళకు కనపడదు."

"గాలి మనశరీరానికి చల్లగానూ, వెచ్చగానూ తాక టము మనం తెలుసుకోటం లేదుటమ్మా?"

"ఇంకేం, అల్లాగే దయ్యం, అదిచేసే పనులవల్ల దాని సంగతి తెలుస్తుంది."

మా అత్తయ్య చెప్పినమాట నిజమే అనిపించింది. కార్యాన్ని బట్టి కారణం ఊహించటం సరియైన పద్ధతే. అందుకని నేను మళ్ళా అడిగాను. "ఏం జేస్తుంది అత్తయ్యా కాస్త నాకు చెప్పు వింటానూ" అని.

"ఏం జెయ్యటమేమిటి? నానా అల్లరీ చేస్తుంది!"

"అరుస్తుందా!"

"ఇంకా అది కూడా ఉంటే ఈ పాటికి అందరి ప్రాణాలు పోయేవే!"

"మరి ఏమిటి అది చేసే అల్లరి?"

"చెప్పితే నమ్మవుగాని నేను కళ్ళారాచూశానురా!"

"ఏమిటమ్మా అది?"

"ఏమిటా? ఒక రోజున నేనూ నాంచారమ్మ ఇల్లాగే కూర్చుని మాట్లాడుకొంటున్నాము, ఎదో పిచ్చపాటీనూ. ఇట్లా మాట్లాడుకొంటూనే ఉన్నాము. ఇంతలో ఆ దయ్యం వచ్చి నాంచారి వీపు పైని ఫెడీమని చరిచింది!"

"అంతగట్టిగా కొట్టటం ఏం బాగుండ లేదు. నాంచారమ్మ చక్కనిది కూడా. వీపు ముద్దెట్టుకోవాలిసింది."

"ఒరేయ్ నీవంతా వేళాకోళం! అందుకనేనీకు చెప్ప నన్నాను. నేను కళ్ళార చూశానుగదా, మాట్లాడుతూ మాట్లాడుతూ ఆమె అమ్మయ్యో అని కేకెట్టి పెళ్ళున విరుచుక పడిపోవటం!"

"అదేదైనా జబ్బు అయివుంటుందమ్మా అత్తా!"

"జబ్బు కావలసిందే! నేను బాగా ఎరుగుదును. ఏహేం జబ్బూలేదు దుక్కలాగుంది. తింటుంది తిరుగుతుంది. నిద్ర పోతుంది. జబ్బు మనిషి అయితే కనబడదురా, ఎండుకు పోవటమూ, ఆర్చుకు పోవటమూనూ! ఏమీలేందే! నిక్షేపం లాగుంది. ఆదయ్యం కొట్టినపుడు మాత్రం విరుచుకు పడు తుంది."

"ఆదయ్యం వల్ల అంతకంటే ఇంకేమీ బాధలేదా?"

"సారె! అదొకటేనా? అర్ధరాత్రి వేళ అటకపైనున్న చెంబులు తప్పాలాలూ ఉహు గలగల్లాడిస్తుంది"

"ఎందుకో?"

"నాబొంద ఎందుకేటి! ఇంట్లోవాళ్ళని హడలగొట్టి చంపటానికి!"

"పంది కొక్కులూ అల్లాంటివి ఏమైనా చెంబు తప్పాల లను కదిలిస్తూ ఉన్నాఏమో?"

"పంది కొక్కులు కావలసిందే! పాత్రసామాగ్రిని ఎత్తిపడేసినట్లు శబ్దంఅవుతుంటేనే! అంతమాత్రం తెలియదూ పోనీ అది అట్లా ఉంచు! దీని కేమంటావు? నిండునీళ్ళగంగాళం, మేము చూస్తూ ఉండంగానే దభీలున పడి పోయింది? మరి ఏమిటి చెప్పుఇది? ఇల్లాంటివే అన్నీ అల్లరి చేష్టలు చేస్తున్నది అదయ్యం."

"అల్లరి దయ్యం అన్నమాట అత్తయ్యా అది వట్టి అల్లరి దయ్యం" అని నేను ఆదయ్యపు స్వభావాన్ని గురించి ఆలోచించగా తేలిన సారాంశం చెప్పాను.

ఆవిడ ఏమీ సంతోషించక మళ్ళీ ఇల్లాగ అన్నది. "అది ఆ ఇంట్లోచేసే అల్లరి ఇంతా అంతా కాదు. దీని దుంప తెగ ఎక్కడనుంచి తెస్తుందో రోజూ ఇటుకముక్కను తెచ్చి ఇంటినిండా పడేస్తుందిరా!"

ఇదేదో తమాషే అనిపించింది "ఇటుక ముక్కలు తేవటం ఏమిటమ్మా?" అన్నాను.

"ఇటుకలురా. మనం గోడ కట్టుకొనే ఇటుకలు చూశావూ అవి!! తెల్లవారేటప్పటికి ఒకకుప్ప తయారౌతూ అవి తీసి పారేస్తే, మరోమూల తయారౌతూ!! ఇల్లాగ నానా గోలనూ!"

అన్నది ఆవిడ నిద్ర కళ్ళతో.

"ఇంటి నిండా ఇటుకముక్కలు పడేస్తూఉంటే చికాగ్గానే ఉంటుంది. మరి ఇప్పుడేం జేస్తున్నారూ ?"

"ఏం జేస్తూన్నారూ, దాన్ని వదిలించుకోవాలనిసకల ప్రయత్నాలూ చేస్తున్నారు. ఈవూళ్ళో ఓ గొప్ప భూత వైద్యుడు ఉంటె ఆయన్ను పిలుచుకు వెడదామని వచ్చాను."

"భూతవైద్యుడు నల్ల అవుతుందంటూవా?" అని అడిగాను.

"ఆ భూతవైద్యుడు మంత్రాలు చదివి ఆదయ్యాన్ని అక్కడనుంచి తోలేయగలడు." అని చెపుతూనే ఉంది ఎప్పుడు నిద్రపోయిందో నిద్రపోయింది ఆమె. ఆ తెల్లవారు ఝామునే ఆమె రైలుకు వెళ్ళిపోయింది.

౨

నాకు మటుకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. ఒకటే ఆలోచన దయ్యాలను గురించి. ఈ మధ్యకొన్ని ఇంగ్లీషుపుస్తకాలు చదివాను. కానొండైల్ కార్పెన్టర్ మొదలైన వారు దయ్యాలు ఉన్నవి అని వ్రాసిన మాటలు జ్ఞాపకం వచ్చినై మా అత్తయ్య తాను కళ్ళారచూచిన విషయాన్ని నేను కాదని ఎలాగ త్రోచిపుచ్చేదీ ? ఆలోచించి ఆలోచించి చివరకు, ఒకవిధంగా దయ్యాలు ఉన్నవి అనే నిశ్చయానికే వచ్చాను.

ఆతరువాత ఈ నాంచారమ్మగారి ఇంట్లో ప్రవేశించిన దయ్యాన్ని గురించి ఆలోచించాను. అది యిటుకలు తెచ్చి పడేస్తుంది అన్న విషయమే నన్ను ఎక్కువగా ఆకర్షించింది. ఇటుకలు ఇప్పుడు చాలా ప్రియంగా ఉన్నవి. సెయ్యి ఇరవై రూపాయలకు తక్కువలేదు. కాబట్టిఅల్లాంటి దయ్యం ఒకటి మన ఇంట్లో ఉండటం చాలా అవసరమని తోచింది.

ఎట్లాగూ దొడ్లో ఒక చిన్న అవుట్‌హౌస్ వేయిద్దామని చాలా రోజులనుంచీ అనుకుంటూనే ఉన్నాను. ఆ దయ్యం పుణ్యమా అంటూ రోజుకో నాలుగు వందల ఇటుకలు తయారుజేసి ఇచ్చిందా మనకు ఏఇబ్బందీ ఉండదు.

నాకు మహాకావలిస్తే ఇరవైవేల ఇటుక కావాలె. నెలాపదిహేను రోజుల్లో తయారుజేసి ఇస్తుంది. దాని తరువాత అది ఇచ్చే ఇటుకలన్నీ పోగుజేసుకొని అమ్మకోవచ్చు. చాలా లాభకరమైన పని. ఆ దయ్యాన్ని మా ఇంటికి తీసుకురావాలె. ఈ ఉపాయం నాకు తోచినందుకు నాకు చాలా సంతోషం గలిగింది.

అయితే ఆదయ్యం మన ఇంటికి వచ్చేటట్లు చెయ్యటం ఎల్లాగు ? ఆ భూత వైద్యుడినే అడిగితే ఆ దయ్యాన్ని తీసుకొచ్చి మా ఇంట్లో వదలివేయమని ? వెళ్ళగొట్టటానికి చేతనైన వాడు తీసుకురాలేక పోతాడా ! కాని ఒకరితో ఈవిషయం చెప్పటానికి నాకు మనస్కరించ లేదు.

కాని ఆదయ్యం వల్ల నాకు చాలా లాభం కలుగ బోతున్నది. కాబట్టి ఎల్లాగైనా దాన్ని రాబట్టటం మరుకు అవసరమని తోచింది.

అందుకని నేనే స్వయంగా ప్రార్థించాను.

"నాంచారమ్మ గారింట్లో ఉంటూఉన్నటువంటి ఓ దయ్యమా! నిన్ను అక్కడనుంచి వెళ్ళగొడితే నీవేమీ విచారపడవద్దు. అంత వద్దు అంటూవుంటే వాళ్ళ ఇంట్లోనే ఉండటం నీకేం ఖర్మం? నీవు యకాయకీని మాయింటికి వచ్చేసెయ్యి" అని మనఃపూర్వకంగా ప్రార్థించాను. ఆ నిశ రాత్రివేళ ఒంటరిగా మంచంమీద కూర్చొని.

నా ప్రార్థన అంగీకరించి ఆ దయ్యం మా యింటికి వస్తుందా అని సందేహం కలిగింది. ఎందుకు రాకూడదు వస్తే రావచ్చు వస్తే అదృష్ట వంతుడ్నే. ఇటుకలు తెచ్చి పెట్టగల దయ్యం బంగారం తెమ్మన్నా తేగలదేమో!

అల్లా ఉద్దీన్ కథ జ్ఞాపకం వచ్చింది. అదిఒక తమాషా అయిన కథ అనే యింతవరకూ అనుకొన్నానుగాని యిప్పుడు అది నిజమైన సంగతేనని తోచింది. ఇటుకరాళ్ళు తెచ్చి పోయగల దయ్యం ఉన్నపుడు, బంగారం తేగల దయ్యం ఎందుకు వుండకూడదూ? ఈదయ్యానికే బంగారం తేగల శక్తికూడా తప్పకుండాఉండి ఉంటుంది. నేను నిజంగాఅదృష్ట వంతుడ్ని అనుకొన్నాను. నాభార్యకు ఓగోలుసు చేయించా

లన్న విషయం కూడా ఆ సమయానికే జ్ఞాపకం వచ్చింది.

బంగారమే తేవాలెగాని రోజుకు రెండు తులాలు తెచ్చినా చాలు. కోలార్ జిల్లాలో గనులు త్రవ్వి బంగారం చేస్తున్నారు. అక్కడనుంచి తెచ్చిపెట్టు అని చెబుదామను కొన్నాను కూడా.

అది బంగారం తెచ్చి ఇయ్యలేదేమోనని నాకేవిూ సందేహం కలుగలేదు. తెచ్చియిస్తుందనేనమ్మకం కలిగింది. కాని ఈ సంగతి ప్రభుత్వం వారికి తెలిస్తే వారునాపైనిపెద్ద పన్ను వేస్తారేమోనని భయం కలిగింది. ఈ ఆలోచనవచ్చే సరికి గుండె గుభేలు మంది. ఏ మాత్రం డబ్బుఉన్నదని తెలి సినా గవర్నమెంటు వారు భరింపరాని పన్ను వేస్తున్నారు. రాజాధిరాజులే గడగడవణికిపోతున్నారు. నేనుఇవ్వలేనంత పన్నువేస్తే నాగతి ఏంకావాలె! ఈదయ్యం బగారం తేవటం మానినేసినా పన్నుమటుకు వదలరు. అదీకాకా దయ్యం ఒకటి మా ఇంట్లో బంగారం చేస్తున్నదని ఆచోకీ దొరికినా ప్రభుత్వం వారు వెంటనే ఆ దయ్యాన్నే ఆహ్వానించి తీసు కెడతారేమో! కాబట్టి రెండో కంటివాడికి తెలియకుండా ఆదయ్యాన్ని మా ఇంట్లో దాచేసెయ్యాలె. బంగారం చేస్తు న్నట్లుకూడా ఎవ్వరికీ తెలియనీయకూడ దని నిశ్చయించు కొన్నాను.

ఇంతకూ ఆదయ్యం మా ఇంటికి వస్తేగిస్తే ఇందతా దేనికైనా భగవంతుడి దయకావాలె. ఈ మాటలోచిన తరువాత నా యిష్టదైవమైన మంగళగిరి నరసింహస్వామికి దణ్ణం పెట్టుకొన్నాను.

"స్వామీ ఆ విచిత్రమైన దయ్యాన్ని మా ఇంటికి పంపించు. దాన్ని ఏ విధమైన పిచ్చి చేష్టలు చేయకుండా కావలసిందేదో ఇచ్చే బుద్ధిగల దాన్నిగా చెయ్యి. ప్రభూ, ఆదయ్యం మాకు బంగారం తెచ్చి ఇచ్చే ఏర్పాటు కూడా చెయ్యి వీలైతే." అని ప్రార్థించాను.

వీలైతే అని నొక్కిఅన్నాను. ఎందుచేతనూ అంటే వీలు అవుతుందో కాదో! ముందుగానే నాకు అది కావాలె ఇది కావాలె అని గట్టిగా అడిగితే ఆదయ్యం కాస్తాచెదిరి పారిపోవచ్చు.

నే నేమన్నా గొంతెమ్మకోరికలు కోరుకొంటున్నానా అని, నన్ను నేనే ప్రశ్నించుకొన్నాను. బంగారం ఎక్కడి నుంచి తెచ్చి యిస్తుంది ఈ రోజులలో, ఎక్కడి బంగారం యుద్ధంలో హరించుకు పోతూ ఉంటే!

పోనీ బంగారం కాకపోతే వెండిచాలు. అదీదొరకక్క పోతే ఇనుమైనా సరే. ఇనుము మటుకు ఏమన్నా తక్కువ ధరలో ఉందా? మేకులు మటుకు మేకులు ఎంత ప్రియమైనవి! కానీకి గుప్పెడు ఇచ్చేవాళ్ళు. ఇప్పుడు కానీకి

ఒక్కటైనా ఇయ్యటంలేదు. అని యిల్లా సరిపెట్టుకుంటూ వచ్చి, చివరకు కట్టెపుల్లలు తెచ్చి పెట్టినా చాలునను కొన్నాను. ఈ రోజుల్లో అడితీల వద్ద చేరిన గుంపులలో జొరబడి తోసుకొని నానా అవస్థాపడ్డా మూడు పుల్లలు దొరకటంలేదు. ఏదో, ఇంతకూ అది రావాలె గాని ఏదో విధంగా సాయపడకపోతుందా అని అనుకొన్నాను.

"ఎందుకు రాదూ ? ఆ దయ్యాన్ని ఆహ్వానించాను భగవంతుడ్ని కూడా ప్రార్థించాను వచ్చేటట్లు చేయమని ! ఇంకా ఏమి చేయూలె ? భగవంతుడు ఆజ్ఞ యిస్తే వచ్చి తీరుతుంది. కాని ఆ భగవంతుడు, ఆ పానకాలరాయుడు, ఆజ్ఞ యిస్తాడా ?"

ఇల్లా అనుకుంటూ ఉండంగానే జ్ఞాపకం వచ్చింది. అరెరే పానకాలరాయుడికి ఎందుకు మొక్కుకున్నానా అని!

ఎందుచేతనూ అంటే పానకాలరాయుడు సగభాగం చెవులు మెలేసి లాక్కునే స్వభావంగలవాడు. చాలా పొరపాటుఅయిపోయింది. తీరా మొక్కుకొన్నాను. ఇప్పుడు యింకో దైవానికి మొక్కు బదిలీ చేస్తే పానకాలరాయుడికి తప్పకుండా కోపం వస్తుంది. "నాకు సగం యివ్వాలిసి వస్తుం దని వీడు యింకో దేవుడ్ని ఆశ్రయిస్తాడా ? వీడి పనిపట్టిస్తా నుండు" అని ఆయన అనుకొంటే అనుకోవచ్చు. ఏమన్నానో అన్నాను. పానకాలరాయుడుమీదే భారం వేద్దామని

నిశ్చయించుకొన్నాను. అనుకోరాని మాట అనుకొని స్వామి ఎడల అపరాధం చేసినందుకు చెంపలు వాయించుకొన్నాను.

ఓ విధంగా మనసుకు సంతోషం కలిగింది. ఆ దయ్యం బంగారమే యిచ్చే పక్షంలో సగం దేముడికిచ్చినా మరేమీ బెంగ లేదు. ఆ మిగిలిన సగం చాలు నా దరిద్రం తీర్చటానికి.

అయితే బంగారం కాక ఆదయ్యం కట్టెలు తెచ్చి పడేసే పక్షంలో నాకు కాస్త యిబ్బందే. ఈ రేషనింగు రోజులలో దానికి మటుకు రెండు మణుగుల కంటే ఎక్కువ యిస్తారా? అందులో సగం దేముడికిస్తే నాకు మిగిలేదేమిటి? యిల్లాంటి ఆలోచన వల్ల మనస్సుకు కాస్త కష్టం కలిగింది కాని, యింతకూ ఆదయ్యం వచ్చిన తరువాత సంగతి గదా చూద్దాములే అని నాకు నేనే చెప్పుకొని సంతోషించి, ఊరుకొన్నాను.

౩

మరునాటి రాత్రి మళ్ళీ అవే ఆలోచనలు. ఆ రాత్రికి దయ్యం మా యింటికి రావాలె అసలు రావటం అంటూ ఉంటే. ఆ రోజు రాత్రే దానికి అక్కడ ఉద్వాసన చెప్తారు ఇహ అక్కడ ఎందుకుంటుంది? యెకాయెకీని ఆ రాత్రే మా యింటికి రావాలె.

అయితే దానికోసం తలుపులు తెరిచి ఉంచాలా వద్దా అన్న సందేహం వచ్చింది. అది తీరా వచ్చేసరికి తలుపులు వేసి ఉంటే ఏమనుకొంటుంది? నేను యింతదాన్ని వస్తే వీడు తలుపులు వేసి ఉంచుతాడా? యిదేనా ఆహ్వానం ఇదేనా మర్యాద! ఛీ వీడి గడప తొక్క-కూడదు అని వెళ్ళి పోతుందేమో అని భయంవేసింది!

అల్లా అని తీసి ఉంచుదామా అంటే ఒక యిబ్బంది ఉంది. ఊరి బయట ఇల్లు మాది. దయ్యం రావటమూ మాకు బంగారం చేసి యివ్వటమూ; ఎల్లాఉన్నా ముందు యింట్లో ఉన్నది కాస్తా ఊడ్చుకు పోతుంది!

ఏం చేయాలిసింది నాకు తోచలేదు. చాలా చికాకేసింది. ఏమిటీ వెధవ పీకులాట అసలు ఈ ఆలోచనలే వదిలేద్దామా అన్నంత విసుకేసింది. కాని ఇంతలో, అబ్బాయీ, ఈమాత్రం కష్టపడకపోతే నీవు ధనవంతుడు ఎల్లాగ అవుతావు? కాబట్టి శ్రమపడి ఆలోచించు, అని ఎవరో చెప్పినట్లు అయింది.

ఆ సమయానికే ఒక చక్క-ని ఆలోచన గబుక్కు-న తట్టింది. తలుపుతీసి ఉంచనక్క-రలేదు. కిటికీలోనుంచికూడా దయ్యం రావటానికి వీలుందీ అని. దయ్యాలు సూక్ష్మజీవులు కాబట్టి. కిటికీచువ్వలూ అవీ, వాటికేవీ అడ్డంగావు సరే అనుకొని కిటికీతలుపులు తీసిపెట్టి పడుకున్నాను.

కాని నిద్రపట్టలేదు. ఓ పెద్ద ఆలోచన నన్ను చాలా బాధించింది. అసలు దయ్యాన్ని ఇంట్లో ప్రవేశ పెట్టటం మంచి పనా అని. పరిచయంలేని మనిషినే రానియ్యమే మన యింట్లోకి వాడు ఎట్లాంటి వాడో అన్న భయంతో! అల్లాంటప్పుడు ముక్కూ మొహం తెలియని దయ్యాన్ని యింట్లోకి తీసుకొచ్చుకోటం అంత తెలివైన పనికాదేమో అనుకొన్నాను. అదీకాక ఆదయ్యం ఎవరో! ఎవరైనా మన స్నేహితుడి దయ్యం అయితే, యింత ఆలోచన ఉండేది కాదు. యిది బొత్తిగా కొత్తదయ్యమాయె!

ఏమిా పాలుబోక ఊహలు ఆలోచిస్తూ పడుకొన్నాను. భయం వేసింది. యింతలో దూరాన ఎక్కడో జట్కా నడుస్తూ ఉన్నట్లు శబ్దంకూడా వినిపించింది. యింకేం, అదే వస్తున్నది అనుకొన్నాను.

చాకలిదయ్యాలు చేరినచోట పల్లకీమోత వినపడుతుందనీ, బ్రాహ్మణ దయ్యాలు చేరినచోట వేదాధ్యయనం జరుగుతూ ఉంటుందనీ, మామామగారు చెబుతూ ఉండేవారు. ఈ దయ్యం పూర్వాశ్రమంలో జట్కా ఎక్కితిరుగుతూ ఉండేదై ఉండవచ్చు. యింతలో జట్కాచక్రాలు రోడ్డుపై దొర్లుతున్న శబ్దం మరీ మరీ దగ్గరగా వినపడటం సాగింది. ఆ శబ్దం మరీ దగ్గరకు వస్తున్నట్లు తోచిన కొద్దీ నాకు గుండెల్లో దడ ఎక్కువైంది.

ఇంకాసేపట్లో ఆ జట్కా మాయింటిముందు ఆగటం, ఆ దయ్యం కిటికీగుండా యింట్లోకి ప్రవేశించటం జరగబోతు న్నదీ అని అనుకొనే సరికి ఎక్కడ లేని భయమూ పట్టు కొన్నది. అది నాకు ఉపకారం చేసేదే, అనుకోండి, ఎట్లా గైనా అది దయ్యంకాని మనిషి కాదు! దాన్ని యింట్లో ప్రవేశపెట్టటం విషయంలో ససేమిరా మనస్సు ఒప్పు కోలేదు.

ఎట్లాగ భగవంతుడా అని ఆలోచనలోకి దిగాను. చటుక్కున మెరుపులాగ ఒక ఊహ నామనస్సుకు తట్టింది.

వెంటనే లేచి ఒక కాయితం కలం తీసుకొన్నాను. దానిపైన వ్రాశాను "మహాశయా మీరు ఎవరో నాకు తెలి యదు. మీ సుగుణ సంపత్తిని గూర్చి విని మిమ్ములను ఆహ్వానించాను. మీకు స్వాగతము. ముఖ్యంగా మీ వలన సాయం పొందాలనే నా ఆశయం. మీరు ఏదో ఒక విలువ గల వస్తువ తెచ్చి మా యింట్లో పడేస్తూ ఉండండి మీకు తోచినది. వీలై తే బంగారం. ఆ విషయం మీ అనుగ్రహానికి వదిలేశాను. మీరు చేసిన సాహాయానికి నేను ఎప్పుడూ కృతజ్ఞతకలిగి ఉంటాను. బైటవరాండాలో వేసియున్న పడక కుర్చీలో తాము శయనించ వచ్చును."

అని ముభావంగా వ్రాసి దానిని మా గేటు తలుపు సందులో పెట్టాను. ఆ తరువాత కిటికీ తలుపులన్నీ మూసి నిద్రపోవాలని పడుకొన్నాను.

నిద్రపట్టలేదు. ఎవరో వీధిలో నడుస్తున్నట్లే శబ్దం అయింది. ఎవరో వస్తున్న చప్పుడు స్పష్టంగా వినవచ్చింది.

ఆ శబ్దం అంతకంతకు దగ్గరగా వినవచ్చింది. గేటు దగ్గర ఎవరో మనిషి నిలబడి ఉండాలె! లేకపోతే అంత స్పష్టంగా ఆశబ్దం వినపడదు. ఇంకెందుకు! ఎవరో గేటు తీస్తున్నట్లు కూడా తెలుస్తునే ఉంది!

వస్తున్నదీ అనుకోనే సరికి గుండెలోతుపాకీపెట్టి పేల్చి నట్లు అయింది. యోగ్యతగల దయ్యం ఒకటి మన యింటికి వస్తూవుంటే, యింత భయం నాకు ఎందుకు కలగాలో నేను చెప్పలేను.

"దారినిపోయే తద్దినాన్ని నెత్తిన ఎక్కించుకోటం అంటే యిదేరా. బంగారం చేసిపెడితే మటుకు దయ్యాన్ని యింట్లో చేరనిస్తారా! వెర్రినాగన్నా ఎంతపనిచేశావు! ఎవ రన్నా వింటే నవ్వుతారు." అని ఎవరో పెద్ద కేకలు పెట్టి నట్లు తోచింది.

ఛా, లేచి పోయి, దాని కాళ్ళమీదపడి యిటుక రాళ్ళూ పడ్డూ, యినపమేకులూ వద్దు తల్లీ, నీదారిని నీవు వెళ్ళు అని అడిగితే!

అల్లా అయితే, ఎందుకు పిలిచావు నన్ను? అంటుంది అది. అంటే బుద్ధితక్కువై పిలిచాను. ఇదిగో చెంపలు వేసుకొంటున్నాను. ఇంక ఎప్పుడూ యిల్లాంటి పిచ్చిపని

చేయును. ఈ తభాను క్షమించు ఓ శాకినీ, ఢాకినీ అని, ప్రార్థన చేద్దామని అనిపించింది.

అప్పటికీ పోకపోతేనో! పోకపోతే నరసింహస్వామిని ప్రార్థనచేస్తినా, అది తప్పక పారిపోతుంది. నరసింహస్వామి పేరు చెప్పినా, ఆంజనేయ స్వామి పేరు చెప్పినా దయ్యాలు పారి పోతయ్యి. ఆ విషయంలో సందేహం ఏమీలేదు నాకు.

అయితే అల్లాగ చేస్తే, ఇందాకటి నుండి నేను అనుకున్న దంతా హుళూష్ కాకి అయిపోతుంది. రానున్న సంపదను వదులుకోటం అవుతుంది. హస్తగతమైన అమృతపూర్ణ కలశాన్ని బోరగించినట్లు అవుతుంది. నిన్ను, నిన్ను, అని వలచి వచ్చిన సకల ప్రాభవ సమలంకృతమైన లక్ష్మీదేవిని గృహ కవాటమునుంచి తరిమివేసినట్లు అవుతుంది. క్రకచ ధారాభ కఠోరదంష్ట్రా భయంకరాట్టహాస ముద్రిత వికృత రూపమైన దరిద్రదేవతను రా రమ్మని ఆహ్వానించి నట్లు అవుతుంది.

కాబట్టి, ధైర్యాన్ని చిక్కబట్టి, నిలవనొక్కుకొని ఆ దయ్యం సంగతి ఏమిటో ఏం జేస్తుందో, ఇటుకలే ఇస్తుందో, బంగారమే ఇస్తుందో కనుక్కోవాలిగాని, పిరికి పందనై, భీరువునై, వెంగలినై, వెర్రినై, వెధవనై, మందమతినై, గాభరాపడి, గబ్బేలుపడి ఇల్లాగ తెలివి తక్కువ దద్దమ్మలో ప్రవర్తించరాదు. చూద్దాం! మరేమి ప్రమాదం లేదు.

దయ్యం సంగతి చూద్దాం. దానివలన మరీ చికాకుగా ఉంటే అప్పుడే ఏదో ఉపాయం ఆలోచించవచ్చు. అని నాకు నేను బాగా ధైర్యం చెప్పుకొన్నాను.

ఈ నిశ్చయానికి వచ్చిన తరువాత మనస్సుకు శాంతి గలిగి నిద్రపట్టింది. మంచి స్వప్నం వచ్చింది. కలలో కొన్ని విషయాలు చూస్తే శుభం, మరికొన్నిటిని చూస్తే అశుభం అని పెద్దలు అంటారు. నేను ఆరోజున కలలో చూచిన వన్నీ, శుభప్రదమైనవే.

నిద్ర మెళకువ వచ్చేసరికి తెల్లవారుతూ ఉంది. మంచమీదినుంచి, గభాలున లేచి వీధిలోకి పరుగెత్తాను దయ్యం ఆరాత్రి వచ్చి ఏంజేసిందో,ఏదైనా తెచ్చి పడేసిందో లేదో చూద్దామన్న ఆదుర్దాతో ముందుగేటు దగ్గరకు వెళ్ళాను.

గేటు దగ్గర ఉత్తరం ముక్క పెట్టింది పెట్టినట్టేఉంది. ఎవరో దాన్ని బొటనవ్రేలితో తాకినట్లు గుర్తు మాత్రం ఒకటి కనిపిస్తూ ఉంది. ఆ తెల్లకాయితంపైన స్పష్టంగా. రాత్రి అది అంటే ఆ దయ్యంగారు దాన్ని ముట్టుకొని ఉంటారు చదవటానికి. నిజంగా ఆమె వచ్చిందన్నమాట !

వచ్చి ? ? ?

ఏదో గాబరా పుట్టింది. ఇంటి ప్రక్కనున్న కాళీస్థలం దగ్గరకు వెళ్ళాను. అక్కడేమీలేదు ! రెండో ప్రక్కనున్న

కాళీ స్థలంలోకి వెళ్ళాను. అక్కడా ఏమీలేదు ! ఇంటిముందున్న స్థలాన్నంతా చూపులతో గాలించి చూశాను.

ఆహా, ఏమీ కనుపించలేదు ! ! నిరుత్సాహం నా హృదయం లోకి తొంగిచూచింది. నిలబడి పోయాను. నిలబడి ఆలోచించాను. ఇంతకూ ఆదయ్యం రానట్టా, వచ్చి కోపంతో వెళ్ళిపోయినట్టా అని ? రాకపోయిన పక్షంలో గేటు తలుపులో, తెల్లకాయితం మీద ఉన్న బొటన వ్రేలి ముద్రసంగతి ఏమిటి ? కాబట్టి వచ్చే ఉంటుంది. వస్తే ఏమీ తీసుకురానట్టేనా అని అనుకుంటూ ఉండంగానే ఇంకా దొడ్లోకి వెళ్ళిచూడలేదన్న సంగతి చప్పున జ్ఞాపకానికి వచ్చింది. అక్కడికి వెంటనే పరుగెత్తాను. ఏమీ ఉండదు అనే నమ్మకంతోనే.

అరె ! నిజంగా విచిత్రం ! !

దొడ్లో, మధ్యగా ఇటుక రాళ్ళకుప్ప ! !

నాకళ్ళు నేను నమ్మలేక పోయినాను. భయము, భ్రాంతి, విభ్రమము, విస్మయము.

ఇవన్నీ కలిసి ఒకటై, నాశరీరంలో సుళ్ళుతిరిగినై. ఆశ్చర్యచకితుడ్ని అయి ఆపాదమస్తకం ఆకంపించి నిశ్చేష్ట కాష్ఠాకృతి తాల్చాను.

౪

దయ్యాలు నిజంగా ఉన్నాయన్నమాట! అందులో కొన్ని ఈరకంగా ఉపకారం చేస్తయ్యన్న విషయంకూడా నిర్ధారణ అయిపోయింది.

ఇంతకూ భగవంతుడికి నాయందు కృపగలిగింది. మా పానకాల రాయుడికి నాయందు దయవచ్చింది. మా నరసింహ మూర్తికి, "రెండవసాటి దైవమిక లేదనుచున్, గడకట్టి, భేరికా దాండ దదాండ ధాండ, నినదంబులు, అజాండము నిండ మత్తవేదండము నెక్కి చాటెదను"—అని మనస్సులో అనుకొని పొంగిపోయాను.

మళ్ళీ ఒకసారి ఇటుక కుప్పవంక చూశాను. అరుణ కాంతిలో, అవి ఎర్రగా మెరసి పోతున్నవి. వాటిని ముట్టుకొని చూశాను అవి నిజమైనరాళ్ళా లేకపోతే ఏమైన మాయరాళ్ళా అని, అవి నిజమైన ఇటుకరాళ్ళు, అందులో ఏమీ మాయలేదు.

ఇహ ఎందుకూ ఊరికే సందేహాలు పెట్టుకోటం. నాకు మంచి రోజులు వచ్చినై. బాగుపడేకాల మొదలుపడ్డది. అంతే.

లోపలికి పోయి పానకాలరాయుడి పటానికి ఎదురుగా నుంచుని "ప్రభూ కృతజ్ఞుడ్ని. నీపాదారవిందములను నిరంతరమూ పూజించే ఈ భక్తుడ్ని కరుణించు. శూన్యంలో నుంచి ఘన పదార్థాన్ని సృష్టించే శక్తి ఈ దయ్యానికి

ఇచ్చావు! బంగారాన్ని సృష్టించేశక్తి కూడా ఇస్తినా ఇక నాకు కోరతగింది ఏదీ వుండదు. ప్రభూ దయచూపు——అని ప్రార్థనచేశాను.

ఇక నాకేమీ ఆలోచలేదు. ఇల్లు తాళంవేసి ఊళ్ళోకి వెళ్ళాను. ఇంట్లో ఉంటానికి ఏదో భయంకూడా వేసింది.

ఇప్పుడు కర్తవ్యం ఏమిటో అని తీవ్రంగా ఆలోచించాను. ఈ దయ్యం బంగారం తెచ్చి యిస్తుందా యిక ముందైనా! ఇవ్వదని తోచింది. ఇచ్చేదైతే ఇవ్వాళే ఇచ్చేది. ఇది యిటుకలు చేసే దయ్యం అయి· ఉంటుంది. దీన్ని యింకొకటి అడగటం బాగుండదు. అడిగినా యియ్యదు.

పచారు దుకాణాలలో పండ్లు అమ్మరు. పండ్లదుకాణంలో ఇంగువ అడిగినా దొరకదు. ఎవడి సరుకు వాడు ఇస్తాడు. కాబట్టి ఈ దయ్యాన్ని ఇంకో వస్తువ అడగటం తెలివి తక్కువ తప్ప మరోటికాదుఅన్న నిశ్చయానికి వచ్చాను.

ఇటుకమటుకు ఇల్లాగ రోజుకు నాలుగువందలు ఇస్తుంటే చాలదూ ? కొద్దిరోజులలో లక్షలులక్షలు అవుతుంది. మనకు కావలసింది ఉంచుకొని మిగిలింది అమ్మి, సున్నం, కలపా అవీ కొనుక్కొని మేడఒకటి వేయవచ్చు, ఇల్లాగఅనుకొంటూ వీధిలో ఉన్న మేడల వంకచూస్తూ నడిచివెళ్ళాను.

6

ఇల్లాగ అమ్మితే ఎంతకాలంలో ఎంతసొమ్ము వస్తుందీ అనిగాని, ఎంతకాలంలో లక్షాధికారిని అవుతాను అనిగానీ, నేను లెక్క వేయలేదు. అల్లాంటి ఊహాలే రానియ్య లేదు.

అల్లాగ చేయటం చాలా తెలివి తక్కువా అనవసర మునూ!! గాలిమేడలు కట్టటం నా తత్వంగాదు. నెమ్మదిగా, తాపీగా, కూర్చుని ఆలోచించటమే నా స్వభావం.

ఆ వెళ్ళటం వెళ్ళటం నేను హోటలుకే వెళ్ళి, భోజ నంచేసి, సరిగ్గా ఇంటికే వచ్చేశాను. జరిగిన విషయం అంతా తల్చుకొంటే చాలా తమాషాగా ఉంది. వళ్లు ఝల్లుమం టున్నది.

ఒక్క విషయం ఏమిటంటే హఠాత్తుగా వచ్చిన ఈ సంపద నన్నేమీ తలక్రిందు చేయలేదు. లాటరీలో లక్ష రూపాయలు వచ్చినైయని విని వెంటనే వెనక్కు విరుచుకు పడిపోయిన వాడిలాగు ప్రవర్తించలేదు. కొంత మందికి పిచ్చెత్తటంకూడా కద్దు. నాకు అల్లాంటి దేమీ జరగలేదు. మనః స్థైర్యము నిలబెట్టుకో గలిగాను.

చివరకు ఎన్ని రోజుల్లో ఎంత ఇటుక మన ఆధీనం లోకి వస్తుంది అన్న ఆలోచనలోకి అయినా దిగలేదు. ఎందుకూ? రేపు ఏమౌతుందో! రేపు అది ఇటుక తెస్తుందో తేనే తేదో!

ఇల్లా అనుకుంటూ ఉండంగానే మరో ఆలోచన వచ్చింది, దయ్యాలు తెచ్చే వస్తువులు నిజమైనవి కావనీ

నిజమైన వానిలాగే కనపడి ఉన్నావ మాయమౌతాయని. ఈ ఆలోచన రావటంతోనే నేను దొడ్లోకి పరుగెత్తుకొని వెళ్ళాను. ఆ ఇటుకలు ఏమైనా మాయమైపోయినాయేమో చూద్దామని. లేదు. ఆ ఇటుకలు కుప్పగా అక్కడే ఉన్నవి. మధ్యాహ్నపుఎండలో అవి మెరుస్తూ అల్లాగే ఉన్నాయి.

ఇది చాలా తమాషాఅయిన విషయము మటుకు అవును. మనకు ఏ విషయమువల్లనైనా సంతోషం గలిగినప్పుడు దాన్నిగురించి స్నేహితులతో చెప్పితే, వాళ్లు మనలను వీపుచరిచి "అదృష్టవంతుడివిపో!" అని అనటంవల్ల కొంత తృప్తి ఆనందం కలుగుతుంది. మనకు కలిగిన సంతోషాన్ని ఇతరులకు కాస్త పంచి ఇయ్యకపోతే మనకేదో బాధగాకూడా ఉంటుంది. ఈ విచిత్రానుభవాన్ని గూర్చి ఎవరితోనైనా చెప్పాలని అనిపించింది కాని దానివలన కొత్తచిక్కులు వస్తాయి అని తోచి నాసంతోషాన్ని నా కడుపులోనే పెట్టుకొని ఊరుకొన్నాను. ఒకటి–రెండు–మూడు రోజులు గడిచినై. ఆ దయ్యం రోజుకు నాలుగువందలని లెక్కప్రకారం తేవటంలేదు. రెండోరోజున సుమారు రెండుమూడువేల ఇటుక పడేసింది!! మూడోరోజున పదివేలు దాకా పడేసింది! ఇల్లాగ రోజురోజు ఎక్కువ చేస్తున్నట్లు కనిపించింది. దొడ్డి నిండిపోయింది. ఇహ ఆట్టే చోటులేదు.

౩

ఇప్పుడో కొత్త సమస్య వచ్చిపడ్డది. ఉన్న ఇటికలను ఏదోవిధంగా ఉపయోగ పరచాలె. లేకపోతే, ఇక వచ్చే సరుకుకు చోటు లేదు. ఈ ఇటుకను అమ్మన్నా అమ్మాలే, లేకపోతే మరోవిధంగానైనా వినియోగించాలె.

అప్పటికి మా ఆవిడ వెళ్ళి అయిదురోజులైంది. ఇక అయిదారు రోజులలో వచ్చేస్తుంది. ఆవిడ వచ్చేసరికి దొడ్లో ఒక ఔట్ హౌస్ కట్టించి ఉంచితే! భలే ఆశ్చర్యపోతుంది చాలా మెచ్చుకుంటుంది.

ఇదివరలో నేను డబ్బుసరిగా వాడటం లేదనీ, దుబారాగా కర్చు చేస్తున్నాననీ, గునుస్తూ ఉండేది. ఇల్లాగ చేస్తే ఆనందిస్తుంది. ఇదంతా నా స్వంత డబ్బు పెట్టి కట్టించాననే చెప్పేస్తాను! నాయందు ఆమెకు చాలా మంచి అభిప్రాయం కలగడమే కాకుండా, నేను ఏదో రహస్యంగా డబ్బు నిలువ జేస్తున్నానని కూడా అనుకోవచ్చు. అల్లా అనుకోటమే మంచిది.

ఆయితే రోజూ ఇల్లాగ ఇటుక వచ్చి పడటం జూచి ఇదేమిటని అడగదా, అప్పుడన్నా తెలియదా ఇది నాస్వంత ప్రయోజకత్వం కాదనీ, అని తోచింది. కాని దానికో ఎత్తు ఎత్తి ఉంచాను.

ఇటుక వ్యాపారం చేస్తున్నానూ అని ఆవిడతో చెబుదామని.

పాపం ఆవిడకు మెడలోకి ఓ గొలుసు మటుకు తప్ప కుండా కొని యివ్వాలె. ఎన్నాళ్ళ బట్టో అడుగుతున్నది.

ఈ ఇటిక బోట్‌హౌస్ కట్టటానికి వినియోగించినా మళ్ళీ నాలుగు రోజులలో పది పన్నెండు వేల ఇటుక తయారు అవుతుంది. వెయ్యి ఇరవై రూపాయలకే ఇచ్చినా ఓ రెండు వందలఏభై రూపాయలు సులువుగా వస్తాయి. ఓ అయిదు నవరసుల గొలుసు! ప్రస్తుతం అదిచాలు. అంతగా అయితే ఇంకో నాలుగు నెలలు పోయిన తరువాత పసిడానిమాట ఆలోచించ వచ్చు. ఇల్లాగే అనుకొన్నాను.

ఇంతకూ ఆ వున్న ఇటికతో వెనకను ఓ ఇల్లు వేద్దామనే నిశ్చయించాను. మూడుగదులుగా ఉండాలనుకొన్నాను. చదువుకొనేందుకు ప్రత్యేకంగా మాకు ఒక్కొక్కరికి ఒక్కొక్కగది కావాలని మొగపిల్లలు చాలా రోజులనుంచి గోల పెడుతున్నారు. వాళ్లు హాలులోనూ వంటింట్లోనూ కూర్చుని చదువుకొంటున్నారు పాపం! ఒక్కొక్కడికి ఒక్కొక్కగది ఇద్దామని నాకూ సరదాగలిగింది. ఎవరి గధిలో వాడు తన పుస్తకాలూ, బట్టలూ, పెట్టెలూ, పెట్టుకొని హాయిగా చదువుకొంటాడు. మిగిలిన గది ముగ్గురు ఆడపిల్లలకూ ఉమ్మడిగా ఉంటుంది. భగవంతుడి దయఉంటే వాళ్ళకు కూడా మూడు గదులు కట్టించాలనే ఉంది. అది ఇప్పటి మాటగాదు.

ఈ దొడ్లో ఇల్లు వేసే విషయంలో మనదగ్గర ఇటుక మాత్రం ఉన్నది కాని సున్నమూ, కలపా, వెంటనేకొనాలె. మేస్త్రీలకూ, కూలీలకు ఇయ్యటానికి కొంత డబ్బు చేతిలోను ఉండాలె. సున్నం అయిదారు బండ్లు అప్పుమీద తేగలనూ, పరవా లేదూ అనుకొన్నాను. కలపమటుకు క్యాష్ ఇచ్చి కొనాలె. మిగతావాటికి దాని తరువాత చూచుకోవచ్చు.

కలప కొంటానికి మటుకు క్యాష్ ఎల్లాగా అని ఆలోచించాను. ఈ ఆలోచన ఎంతోసేపు పట్టలేదు. బ్యాంకిలో అప్పు తీసుకొందామని వెంటనే నిశ్చయించేశాను. తరువాత నాలుగు రోజులలో ఇటుక అమ్మి ఎట్లాగూ అప్పు తీర్చి పారేస్తాను. కాబట్టి అప్పు చేయటంవల్ల వచ్చినపెద్ద ఇబ్బంది ఏమీలేదు అని కూడాతోచింది.

మా ఆవిడ వచ్చేలోపల ఇల్లు తయారైపోవాలనీ, ఆవిడ వచ్చి చూచి ఆశ్చర్యపడి "అరె! ఎప్పుడు కట్టించారండీ? ఎంత అందంగా ఉందండి? డబ్బు ఎక్కడదండీ అప్పు జేయలేదుగద?" అని అంటూఉంటే "అప్పులేదూ, ఏమీ లేదు. ఏదో డబ్బు క్యాష్‌రూపంగా ఉంచుకోటం మంచిది గాదు. ఈ యుద్ధపురోజుల్లో, అని కొంతమంది స్నేహితులు అంటే, సరే, ఎందుకు వచ్చిన గోల అని ఇల్లాగ చేసేశాను"—అని దర్జాగా తమాషాగా నిర్లక్ష్యంగా నేను అందామనీ, నిశ్చయించుకొన్నాను. "ఇన్నాళ్ళబట్టి చెప్పారు

కారేమండీ! నిలువజేశారన్నమాట! డబ్బులేదూ, అంటూ ఉంటే తెలివితక్కువదాన్ని మీరు పాడుచేస్తున్నారనుకొన్నా! అమ్మ ఎంత దొంగండి మీరు! పోనీలెండి మంచి పనిచేశారు. పిల్లలకు కాస్త ఆస్తి ఏర్పడుతుంది.'' అని ఆవిడ తప్పకుండా అంటుంది

కాబట్టి ఇల్లు తత్‌క్షణం తయారుచేసి ఇల్లాంటి సరదా మాటలు విందామనుకొన్నాను. ఆ మధ్యాహ్నమే బ్యాంకికి వెళ్ళి నూరురూపాయలు అప్పుపుచ్చుకొన్నాను. మనవూళ్లో అడితీలో కొనేకంటె గుడ్లవల్లేరు రేవులో కొంటే, కర్ర చాలా చౌక? అంతేకాక మంచిదికూడా దొరుకుతుంది. అందుకని డబ్బు జేబులో వేసుకొని గుడ్లవల్లేరుకు కారు ఎక్కాను.

గుడ్లవల్లేరులో నేను ఆట్టేసేపు ఉండలేదు. గిల్లిబేరం చేయటం నా స్వభావమూకాదు. మంచి టేకుకర్ర కావలసింది బేరంచేసి, ఇంటికి పంపమని చెప్పి, యాభైరూపాయలు అడ్వాన్సు ఇచ్చి మిగతా యాభై ఇంటిదగ్గర ఇస్తానని చెప్పి వచ్చేశాను.

నేను ఊళ్లోకి రావడం ఏడుగంటలకే వచ్చినా, కాఫీ హోటలులోనూ, అక్కడా కాసేపు గడిపి, భోజనంచేసి రాత్రి ఎనిమిదిగంటల ప్రాంతాన ఇంటిదారి పట్టాను. ప్రొద్దున వెళ్ళటం అదే రావటం.

౬

నేను మా యింటికి ఓ ఫర్లాంగుదూరంలో ఉండంగానే మా ఇంట్లో ఓ దీపం వెలుగు కనిపించింది. ఏమిటా అని చూశాను. కిటికీలోనుంచి స్పష్టంగా దీపపు వెలుగు కనిపిస్తున్నది. దీని దుంప తెగ ఆ దయ్యం ఇంట్లో ప్రవేశించి ఇల్లంతా చూస్తున్నదిరా అనిపించిది. గుండె బద్దలై పోయింది మెల్లగా నడిచి వెళ్ళాను. ఇంటిముందు ఒకనిమిషం నిలబడి చూశాను. ఇంట్లో ఎవరో మెదులుతున్నట్లుకూడా అలికిడి అయింది. ఇంతలో చప్పున జ్ఞాపకంవచ్చింది మాఆవిడీ వచ్చి వుంటుందీఅని. నా తెలివి తక్కువకునవ్వుకొని గబగబా లోపలికి వెళ్ళాను—''ఎప్పుడొచ్చావ్! ముందుగా ఉత్తరమైనా వ్రాయలేదేం?'' అంటూ; ప్రొద్దునే ఆరుగంటల బండికే వచ్చాము. అయ్యగారు ఇంట్లోలేరు. నాదగ్గరకూడా తాళం చెవి ఒకటి ఉండబట్టి సరిపోయిందికాని లేకపోతే ఇప్పటిదాకా చలిలో బయటఉండాలిసివచ్చేది! ఎక్కడికి వెళ్లారూ అన్నది.

''నేను ఎక్కడికి వెళ్ళిందీని చెప్పటానికి ముందు నీకు చెప్పవలసినసంగతులు చాలాఉన్నవి. నీభోజనం అయిందా? పిల్లలు అప్పుడే పడుకొని నిద్రపోతున్నారే!'-అన్నాను.

ప్రయాణం బడలికవల్ల నిద్రవస్తుంటే అన్నం వండి పిల్లలకుపెట్టి ఆకలైతే నేనూ తినేశాను. మీ భోజనం మాట ఏమిటి?

"నేను భోజనంచేసివచ్చాను. హోటల్లో" అన్నాను. ఆ తరువాత ఒక అరగంటలో కాంతం ఇల్లంతా సర్దుకొని వచ్చి నా ప్రక్కనున్న మంచంపైని నడుమువాల్చి "ఏమిటి సంగతులు చెప్పండీ—చాలా సంగతులు ఉన్నాయి అన్నారూ" అన్నది.

౭

ఇప్పుడు నేను ఈ దయ్యం ఇటుకలు తేవటం సంగతి అంతా చెప్పెయ్యాలా, వద్దా అని ఆలోచించాను. చెప్పేస్తే ఇల్లు కట్టటంలో స్వప్రయోజకత్వం ఏమీ లేకుండాపోతుంది. కాబట్టి ఆ విషయం దాచేసెయ్యాలె. అసలు నేను వేసుకొన్న ప్లాను సగం పాడైపోయింది. రోడ్లో క్రొత్తయిల్లు వేసి ఆమెకు చూపిద్దామనుకొన్నాను. కాని ఆమె నాలుగైదురోజులు ముందుగా రావటంవల్ల నేను అనుకొన్నంత ఆశ్చర్యం ఆమెకు కలుగజేయలేకపోయినాను. ఇప్పుడు అసలు సంగతి చెప్పేస్తే వ్యవహారం బొత్తిగా చప్పబడిపోతుంది. ఆ రాత్రికి ఆ విషయము బైటపెట్టవద్దనే అనుకొన్నాను.

మర్నాడు కలప వస్తుంది. పనివాళ్ళనుకూడా రమ్మని చెప్పి వచ్చాను. ఇదంతా చూచి ఆమె ఆశ్చర్యపడితే అప్పుడు చెప్పవచ్చు. అప్పుడైనా దయ్యం సాయంవల్ల ఇటుకలు వస్తున్నాయని చెప్పకూడదు. అల్లా చెపితినా సంతోషిస్తుందిగాని ఆవిడకు నామీద గౌరవం మాత్రం

కలుగదు. అసలు ఆసంగతి ఎత్తకూడదు. ఇటుక వ్యాపారం వల్ల అపారధనం గణిస్తున్నట్లు ఆమెకు అభిప్రాయం కలుగ జేయాలె.

అందుకని ఆమెతో ఈకథ ఏమీ చెప్పలేదు. అమ్మాయి పెండ్లికి వెయ్యినూట పదహార్లు కట్నం యిచ్చి మంచి సంబంధం తెస్తానన్నాను. ఆవిడకు నాలుగైదు రోజులలో ఓ జిగినీ గొలుసో, లేకపోతే ఒక అటుకులగొలుసో, కొనిఇస్తానన్నాను. ఓ రేడియో కూడా కొనుక్కుంటే బాగుంటుందా అని అడిగాను. ఈ మాటలు విని సంతోషించటానికి బదులు మండి పడి, "చాల్లేఊరుకోండి. గొంతెమ్మకోరికలూ మీరూనూ! అన్నీ కొనేవారిలాగే జిగినీగొలుసు కావాలా అటుకులగొలుసు కావాలా అనీ, రేడియోకొంటే బాగుంటుందా అని అడుగుతున్నారు! అయ్యో! అయ్యో! మీరు గొలుసు చేయించనూ, నేపెట్టుకోనూనూ!! ఇంటికైన అప్పుఅట్లాగే ఉంది. ఆవగింజలో అరవీసం తీరలేదు. రేడియో కొంటారట రేడియో!!" అని చీదరించింది, "నీకేం తెలుసు నాసంగతి కొనగల్నో లేదో నీకే తెలుస్తుంది కొద్దిరోజుల్లో!" అని ఊరుకొన్నాను.

"నాకు తెలియనిది ఏముంది? డబ్బు ఎక్కడినుంచి అయినా కొట్టుకురావాలె!" అన్నది ఆవిడ విసుగ్గా.

"కొట్టుకొస్తుంది చూస్తుండు" అన్నాను ధైర్యంగా. నామాటలయందు ఆవిడ ఏ మాత్రం విశ్వాసం చూపలేదు.

నాకు డబ్బుచేసే ఉపాయం దొరికిందని నేనూ చెప్పలేదు ఆవిడకు !!

మర్నాడు నేను నిద్రలేచే సరికి మా ఆవిడ ఎవరి మీదనో పెద్దగా కేకలు వేస్తున్నది. ఆ కేకలవల్ల నాకు మెళుకువ వచ్చింది.

"మాకు కాదయ్యా. మాకెందుకూ ఈ దూలాలూ కడ్డీలునూ ! ఎవరివో !" అంటూన్నది మా కాంతం. అవతలవాడు, "పంతులుగారు నిన్న కొన్నారండి" అంటూన్నాడు.

"మా పంతులుగారు కాదని చెపుతూఉంటే వినవేం ! ఎవరివో కనుక్కో- మాకుగాదు" అంటూన్నది ఈవిడ.

ఈ గోల విని నేను గబాగబా వాకిట్లోకి పరుగెత్తికెళ్ళి "మనకేలేవే కాంతం ఊరుకో నేను కొన్నాను" అన్నాను.

"ఎందుకూ! అన్నది ఆవిడ నన్ను వెర్రివాణ్ణిలా చూస్తూ.

"నీకు తెలియదులే ఊరుకో, దొడ్లో ఒక ఔటుహౌస్ వెయ్యాలను కొన్నాను. ఇటుక తెప్పించాను. సున్నం పంపమని చెప్పివచ్చాను. పనివాళ్ళు ఇంకా కానేపటి కల్లా వచ్చి పని ప్రారంభిస్తారు" అని సంగతులన్నీ చెప్పేశాను. వడగళ్ళలాగ పడిపోయినై విశేషాలన్నీ. ఆవిడ ఆశ్చర్యపోయింది. పోక ఏంజేస్తుంది హడలగొట్టేస్తిని ఒక్కసారి ! ఆవిడ విచిత్రంగా చూస్తూ నిలబడివుంది.

"రాత్రి అంటివే డబ్బు ఎక్కడినుంచి అయినా కొట్టు కొస్తుందా అని! యిప్పుడేమంటావ్! యిటుక ఉంది. కలప కొనేశామ్. ఎల్లుండి కల్లా యిల్లు తయార్!!" ఈమాటలు. ఆమెకు ఆశ్చర్యం కలగటానికి ఏపద్ధతిలో అనాలో ఆపద్ధతిలో అన్నాను గర్వంగా.

ఆవిడ తెల్లపోయి చూస్తూ, "ఏమిటీ! ఎంతపని జరిగిందండి! ఒక్కమాటైనా అనకపోతిరేం!!" అని అడిగింది. "యిటుక నీవు యింకా చూడనేలేదూ!! రా చూపిస్తా." అంటూ ఆవిడను నెట్టుకుంటూ దొడ్లోకి తీసికెళ్ళాను.

అరె!!

ఒక్క యిటుక ముక్కైనా లేదు అక్కడ. పైగా యిదేమిటి!! శాస్త్రిగారి యింటికీ, మాయింటికీ మధ్య గోడ ఒకటి లేచింది!

నాకు నోటమాట రాలేదు. నిర్ఘాంత పోయినాను. ఎట్లా జరిగిందీ ఈ వింతా అని! ఆ దయ్యం పనా యిది? చా; ఎప్పటికీ కాదు.

అయితే ఎట్లా, జరిగిందీ అని ప్రశ్న వచ్చిందికాని, ఎంతోసేపు ఆలోచించవలసిన అవసరము లేకపోయింది. ఆ శాస్త్రిచేసిన పనే యిది! కనపడుతూనేఉంది. నేను యింట్లో లేకుండా చూచి ఈ పనిచేసి ఉంటాడు! నిన్నసాయంత్రానికి యిది తయారై ఉంటుంది. వీడి దుంపతెగ ఎంత దౌర్జన్యం

చేశాడూ ! యిటుకంతా కాజేశాడే !! అని ఆలోచిస్తూ నుంచున్నాను. ఆవిడను లాక్కొచ్చిన విషయమే మరిచి పోయినాను.

“ఏమిటండీ అలాచూస్తారూ? ఎందుకూ ఆ గాబరా?” అని ఆవిడ అడుగుతూ ఉన్నా నేను వినిపించుకోలేదు.

ఈవిడ ప్రొద్దునే వచ్చిందికదా, యింతపని జరుగుతూ ఉంటే తెలియకుండా ఉందా ? పనివాళ్ళువచ్చి హడావుడిగా గోడకడుతూ ఉంటే ఈవిడకు తెలియకుండా ఎల్లాగవుంటుంది? తెలిసే ఉంటుంది. తెలిసినప్పుడు ఆవిడచూస్తూ ఊరుకోకపోతే అదేమిటండీ అనకూడదూ ?

అంత యిటుకా ఆయన పబ్లిక్కుగా కాజేస్తుంటే ఈమెగారు ఊరుకోటం ఏమిటి ! యిల్లాగ అనుకొని మొత్తం మీద తప్పు అంతా అవిడదే అయినట్లు తేల్చుకొన్నాను. ఈ నిశ్చయానికి వచ్చేసరికి ఒక్కనిమిషం పట్టింది. ఇంతలో నూకాంతం నాదగ్గరకొచ్చి మీదచెయ్యివేసి “ఏమిటి అల్లాగ చూస్తున్నారూ?” అని అడిగింది! నాకు వళ్ళు మండిపోయింది ఆవిడ యిల్లాగ ఏమీ తెలియని నంగనాచిలాగ అడగడం చూస్తే !

“యహ్హా ఉండు మహా తెలియనిదానిలాగ అడుగుతావు ?” అని అంటూ ఆవిడ చెయ్యి విదిలించి వేశాను.

“ఏమిటండీ తెలియటం ?”

"ప్రొద్దున ఇక్కడ ఇటిక ఉందా ?"

"ఆ"

"అదంతా ఏమైంది ?"

"ఏమైందో కనపడటం లేదండీ గోడ కట్టించా డాయన ?"

"గోడ కట్టిస్తూ ఉంటే నీవు చూస్తూ కూర్చున్నావు కాబోలు ?"

"చూడక ఏంజేయమంటారండీ ?"

"ఆ మాత్రం తెలియదూ ? ఇంట్లో నేను లేకుండా జూచి ఇటికలంతా ఆయన కాజేస్తుంటే నోరు తెరుచుకు చూస్తూన్నావూ, ఇంటి కైనదానివి ? వద్దని అనటం తెలియ దేం ?"

"అదేమిటండీ అల్లా అంటారు ? ఆయన సొమ్ము ఆయన వాడుకొంటూ ఉంటే నేను వద్దు అనటం ఏంబాగుం టుందండీ."

"ఆయన సొమ్మా ? ఇటుక అంతా తనదే అన్నాడు కామాలు ! నీవు నమ్మావు ! తెలివితక్కువ దద్దమ్మవు ! ఆయన అంటేమటుకు ఒకవేళ మనదేమో, యింటాయన తెప్పించారేమోనని అనుకోవద్దూ ?"

"అయ్యో కర్మమా అదేమిటండీ అల్లాకోప్పడతారూ! వాళ్ళు మన నోడ్లో ఇటుక వేసుకొంటామని నాకు ముందు

గానే చెప్పారూ! నేను వెళ్ళే రోజునే జానికమ్మగారు నన్ను అడిగింది. మా ఇటుక బండ్లు వస్తుయ్యామ్మా. మా దొడ్డి బొత్తిగా చిన్నది. స్థలంలేదు. మీ దొడ్లో వేస్తామని. పోనీ ఏంభాగ్యం వేసుకోండి అన్నాను. ఇవ్వాళ ప్రొద్దునే శాస్త్రి గారు పనివాళ్ళను పిలిపించి గోడ పూర్తి చేయించాడు. కొద్దిగా మిగిలిన ఇటుక వాండ్ల దొడ్లో ఒకమూల వేసుకొన్నారు. ఆయనేమిటి? మీ ఇటుక కాజేయటం ఏమిటీ? నాకేం అర్థం కావటంలేదు!''

ఈ మాటలు వినేసరికి, ఆకాశం విరిగి మీద పడ్డట్లు అయింది. నా తలతిరిగి పోయింది. ఈ ఇటికంతా మా దొడ్లోకి ఇల్లాగ వచ్చిందని నాకేమి తెలుసూ!

ఆ శాస్త్రిగారు ఇటుక తోలించు కొంటున్నారు అని నాకు ముందుగా తెలిస్తే, ఇంత కథ జరగకుండా ఉండేది. ఇప్పుడెట్లా కలప వచ్చి కూర్చున్నదాయె! పనివాళ్లూ వస్తూ ఉంటారు బహుశ! సున్నంకూడా పంపమని చెప్పితిని!! అంచేత చాలా కోపం వచ్చింది కాని ఎవరి మీద కోప్పడాలో తెలియలేదు.

చివరకు ''ఏసీ సంగతి నాతో చెప్పలేదేం?'' అని మా ఆవిడ మీదే ఎగిరిపడ్డాను. ఆవిడ అన్నది. ''ఏమంత మహాభాగ్యమని చెప్పాలె! మరిచి పోయినాను. అదీగాక ఆ రోజే వెళ్ళిపోతిని!'' ఈ మాటలు అని ఆవిడ బిక్క ముఖంతో అక్కడే నిలబడ్డది.

నేను ఆవిడను అక్కడ వదిలేసి వాకిట్లోకి వెళ్ళాను. ఆ కలప ఏంజెయ్యాలన్న సమస్య ఒకటివచ్చింది. "ఈకలప ఎందుకు కొన్నారూ? ఇటుక మీరు కొంటే ఆయన కాజేయుట మేమిటీ!—ఏమిటో సంగతి చెప్పండి ?" అని మా ఆవిడ గొడవ. బండివాడు బాడిగ యిమ్మని గొడవ. తల తిరిగి పోతుంది. పిచ్చి ఎత్తుతున్నది.

ఇంతలో నేను గేటుకుకట్టిన ఉత్తరం క్రిందపడిఉంటే దాన్ని మా కాంతం తీసిచూచి, "ఇదేమిటండోయ్ ? నేను యింతసేపటినుండి చూడనేలేదు ! ఎవరికి వ్రాసిన ఉత్తరం ఇది ?" అని ఉరిమిచూస్తూ అడిగింది.

నేను ఏం జెప్పేది ? అసలే మనస్సు నానా ఖంగాళీగా ఉందాయె. "దానికీ" అన్నాను. "దేనికీ ? దేనికండీ ఈ ఉత్తరం ? మీరు వచ్చిన దాకా కుర్చీలో కూర్చోమని రాశారు కూడా !" అని నిలవ తీసి అడిగింది నన్ను అనుమానిస్తూ.

౯

వ్యవహారం అంతా వెధవ గొడవ క్రింద తేలిపోయింది. వళ్ళు అంతా చీదర పుట్టింది. చీకాకేసింది. కోపం వచ్చింది. ఇప్పుడావిడకు ఈ ఇటుక సంగతి ఏమని చెప్పేది ? నేనే తెప్పించాను. ఆయన కాజేశాడు అని నిలబడితే పెద్ద పోట్లాటా, సాక్ష్యాలూ వస్తాయి. అసలు నిజానికి ఇటికేమో

ఆయన తోలించుకుంటే, అది నాది అని నేననుకొంటిని ఈ దయ్యపు గొడవలో పడి!! ఈ ఉత్తరం ఎవరికి వ్రాశానని చెప్పేది. ఈ ఛండాలపు చిక్కుల్లోపడి తల గోక్కుంటూ నుంచున్నాను.

"ఏమండీ ఏమిటీ గొడవ అంతానూ? ఇటుక ఆయనదే అని నేను అనుకొన్నాను, వాళ్ళు ముందుగా నాతో చెప్పారు కాబట్టీ! మనదా ఏమిటండీ? మనదైతే ఆయన అంతధైర్యంగా అన్ని వేల ఇటుక ఎల్లా కాజేస్తాడండీ ? మీరు ఎవరికి డబ్బు ఇచ్చారూ మనకి ఇటికతోలమనీ? భద్రయ్యకేనా! ఏమాత్రం యిచ్చారూ ? ఓ పాతికైనా యిచ్చి ఉంటారు ! పాతికేం, యాభై యిచ్చి ఉంటారు ! అంతేనా ?" అని ఊరికే ఆవిడ అడుగుతూఉంటే నేను ఏమీ మాట్లాడలేదు. పట్టుబడ్డ దొంగలాగ నుంచుని ఊరుకొన్నాను. ఆవిడకు మరీ అనుమానం కలిగింది.

మళ్ళీ యిల్లాగ అన్నది ఆవిడ, "సరే, యింకెందుకూ; తెలిసింది. భద్రయ్యకేమో యాభై రూపాయలు యిస్తే వాడు కాజేసి ఊరుకొన్నాడు. మీరేమో యిదంతా భద్రయ్యతోలిన యిటుకే అనుకున్నారు. అంతే గదండి ఏమాత్రం తగలేశారు చెప్పరేం?

నేను మాట్లాడక ఊరుకున్నాను. నేను ఊరుకొంటే ఆవిడ ఊరుకొందా? లేదు. ఈ వుత్తరం ఎవరికండీ వ్రాసింది?

మహాశయా అని వ్రాశారు. ఎవరు ఈ మహాశయి ? ఏమి పనండీ యిది నేను ఉళ్లో లేకుండాజూచి!! అని అడుగుతుంటే గుండెల్లో గుద్దినట్లు అయింది.

ఇహ ఎందుకొచ్చిన గోల అని, దయ్యపు సంగతి అంతా, ఆస్థితిలో చెప్పగలిగినంత ఓపికగా, టూకీగా చెప్పాను.

చెపితే ఏంలాభం ! "నేనంత తెలివి తక్కువ దద్దమ్మను కానండోయ్ ! దయ్యానికి ఎవరైనా ఉత్తరం వ్రాస్తారా ? ఎక్కడైనా విన్నామా యిల్లాంటి సంగతి ! యిహ ఊరుకోండి" అని గట్టిగా అని, ఆ ఉత్తరం అక్కడ విసిరి పారేసి చురచురాచూస్తూ వెళ్ళిపోయింది. నేను ఆ ఉత్తరాన్ని చేత్తోపట్టుకొని ఆ కొత్తగా గట్టిన గోడవంక చూస్తూ, దిగాలపడి నిలబడి పోయాను.

బాకీ

౧

"నామాట వింటే ఇంతవరకు రాదు అన్నయ్యా! ఆవచ్చిన అరవై నాచేతులో పడేస్తే, కానీ అప్పు లేకుండా జరుపుతాను అంటే వింటేనా ఆయన!"

"నేను చెప్పా నమ్మా! నీకు వచ్చిన .జీతం అమ్మాయికి ఇచ్చేయరా; ఆడవాళ్ళు మనకంటే పొదుపుగా వాడుతారూ అని చెప్పానమ్మా?"

"మీరే కాదు అన్నయ్యా! అంతా చెప్పారు. వింటేనా? చూస్తున్నారుగా సంగతి అంతా! బియ్యంవాడికి యాభై రూపాయలు ఇవ్వాలి. ప్రొద్దున్నే ఆయన వచ్చి కేక వేసి వెళ్ళాడు. నేను వంటఇంట్లో ఉన్నాను అప్పుడు చెయ్యి ఊరుకోలేదు. లేకపోతే వచ్చి, అప్పు పెట్టినందుకు ఆయనను నాలుగు చీవాట్లు వేసేదాన్ని."

"వాడ్ని చీవాట్లు వేస్తే ఏంలాభం అమ్మాయీ! మన బంగారం మంచిది కాకపోతే కంసాలి ఏం జేస్తాడూ!"

"బాగా అన్నారు! ఇల్లాగ వళ్ళూ పై తెలియకుండా కర్చు చేస్తే ఎన్నాళ్ళని గడుస్తుందంటారూ!"

"నిజమే మరి"

"నిజ మని మెల్లిగా అంటారేమిటి? ప్రస్తుతం మీరూ మేమూ కలిసిఉన్నాము కాబట్టి ఏమన్నా, ఏమున్నా ఏం లేక

పోయినా, ఇబ్బంది అంటూ కనబడటం లేదు ? రేపు వేరుడు కాపురం పెడితే తెలిసొస్తుంది అయ్యగారికి !'' అన్నది మా బావమరది భార్య విసుగుతో.

"ఎల్ల కాలం ఇల్లాగే ఎందుకుంటుం దమ్మా ! ఏదో చిన్నతనం ఇంకా నాలుగేండ్లు గడిస్తే వాడికే వస్తుంది జ్ఞానం !'' అన్నాను నేను.

నిజానికి వాడిని గట్టిగా చీవాట్లు వేయటానికీ వీలు లేదు. అరవై రూపాయలు వస్తున్నాయి రావటానికి. కాని అందులో నెలకు ఓ ఇరవై రూపాయలు ఇంటి దగ్గరున్న తల్లి తండ్రులకు పంపుతున్నాడు మొగుడూ పెళ్ళానికీ మిగిలిన నలభై సరిపోవలసిందే. కాని–ఏదో చిన్నతనంచేత బట్టలకూ, వాటికీ, కాస్త ఎక్కువే కర్చు చేస్తున్నాడు. సంవత్సరానికి రెండువందల రూపాయలు వచ్చే సదుపాయం ఉందికదా, అప్పు కాస్త అయితే మట్టుకు ఏమి. తీర్చుకో లేకపోతాడా అని నేనూ ఊరుకున్నాను. ఎప్పుడో వచ్చి నప్పుడు ఇస్తానంటే వర్తకులు ఊరుకోరు. అందుచేత అంత వరకూ ఆగటానికి వీలులేదంటూ బియ్యపువర్తకుడు మా వాడిని వేధిస్తూఉన్నాడు. దానితరువాత తీసుకోవచ్చు వాడికి సమయానికి కాస్త సహాయపడదా మని నేను అనుకోటం అయితే అనుకొంటాను. కాని అనుకోటంతోనే సరి ! ఇద్దా మంటే ఉండేదికాదు. వందరూపాయలు తెచ్చుకొంటున్నా నాసంగతి అంతకంటే అధ్వాన్నం. వాడికింకా కాస్త అప్పు అయినా పుడుతుంది. నాకు అదీ లేదు. అయితే నాది పెద్ద

సంసారం. పిల్లల చదువులకూ వాటికీ ఖర్చులున్నాయి. వాడికి ఏ బాదరబందీ లేదు. వాడు కాస్తో, కూస్తో, వెనకేయవచ్చు అందుకని ఈతభా వాడికి కాస్త గట్టిగా చెప్పాలనే అను కొన్నాను.

ఆరోజు మధ్యాహ్నం భోజనాలైన తరువాత మావాడి తో ఈ ప్రసంగం ఎత్తి. అప్పులవాళ్ళు మన ఇంటిచుట్టూ తిరగటం మన కేమీ మర్యాదగా లేదురా నాయనా! నీవు ఎక్కడైనా తెచ్చి అయినా సరే ఆ బియ్యంబాకీ తీర్చి వేసెయ్యి అని కోప్పడ్డాను.

"నిజమే బావా! దరిద్రంగానే ఉంది. వారం రోజు లలో ఈ బాకీ తీర్చేస్తాను" అన్నాడు. తీర్చే సెయ్యి. తీర్చి ఇకమీందట, నీకు వచ్చే జీతం, జీతం అమ్మాయికి ఇస్తుండు. ఆడవాళ్లు వాడినంత పొదుపుగా మనం వాడలేము అన్నాను. అమ్మాయి వింటూఉండంగానే. వాడు భార్యవంక చూచి ముసిముసినవ్వులు నవ్వుతూ "అల్లాగే బావా, నీవు ఇంతగా చెప్పనక్కర లేదు, తప్పకుండా అల్లాగే ఇస్తాను" అన్నాడు. వాడిభార్య "ఆ అన్నీ ఇచ్చారు! ఎన్నిసార్లు అన్నారు ఇల్లాగ" అని ముక్కూ మూతీ విరిచింది.

౨

ఆ తరువాత రెండుగంటలకే మావాడు టీకుటాకుగా ముస్తాబై ఎక్కడికో బయలుదేరుతున్నాడు. ఎక్కడికీ అని అడగటం మంచిది కాదు. కాబట్టి ఊరికే సందేహంతో

నవ్వుతూ వాడివంక చూశాను. ఆ వికారపు చూపుల్లో నా ప్రశ్న బయటపడ్డది. వాడూ ఆ సంగతి గ్రహించాడు.

"ఇవ్వాళ మా బ్యాంకి అధికారి నాలుగుగంటల బండిలో వస్తాడు బావా. నేను వెళ్ళి రిసీవ్ చెయ్యాలె" అన్నాడు మావాడు.

"అయితే నాలుగుగంటల బండిలో వచ్చే ఆయనను రిసీవ్ చేయటానికి రెండు గంటలకే బయలుదేరాలా ?" అని అమ్మాయి అన్న ఈ ప్రశ్న విని వాడు పకపకా నవ్వి, దానికో కారణం ఉంది బావా అన్నాడు.

ఒకటేం రెండు ఉన్నాయి అన్నయ్యా అన్నది వాడి భార్య నవ్వుతూ. ఇద్దరూ పకపకా నవ్వుకొన్నారు. ఎందుకో నాకు అర్థం కాలేదు.

"ఏం లేదు బావా, మూడు గంటలకు ఓ టీపార్టీ ఉంది, ఆంధ్రా ఇన్సురెన్స్ హాలులో" అన్నాడు వాడు. "ఆ, ఆ. ఎందుకండీ ఆగోడవంతా ? అసలు సంగతి చెపితే ఏం ?" అన్నది వాడి భార్య.

మావాడు భార్యవంక తిరిగి, అసలు సంగతికి ఏముందీ అంటూ, ఇదిగో, ఇది చూడు బావా అని ఓ ఎర్రకాయితం నాకు అందించాడు. నేను చూచి నవ్వుకొని, నిజమే నమ్మా టీ పార్టీమాట నిజమే అన్నాను.

టీ పార్టీ మూడింటికైతే రెండింటికే బయలు దేరటానికి కారణం ఏమిట్లో అడుగు అన్నయ్యా! అన్నది కనకం

విరగబడి నవ్వుతూ, "అడగటం ఎందుకూ, వాడే చెబుతాడు-" అని నే నన్నాను.

చెప్పటానికి ఏముంది లేదు బావా, టీపార్టీ కాబట్టి ముందుగా వెళ్ళటం దేనికైనా మంచి దని వెడుతున్నాను. అంతే, అని భార్యను చూచి ముసిముసి నవ్వులు నవ్వాడు.

"అది కాదండీ అన్నయ్యా, రెండున్నరకు బియ్యపు వర్తకుడు వస్తాడు. వస్తానని చెప్పి వెళ్ళాడు లెండి. అందుకని హడలిపోయి పారిపోతున్నారు" అని నిజం కాస్తా బయట పెట్టింది.

మావాడు భార్యను కోప్పడలేదు, "హడలిపోవటం కాదు బావా వారంరోజుల్లో ఎట్లాగూ వస్తుంది. ఇచ్చేస్తాను. ఏదో ఈనాలుగు రోజులూ వాడి కళ్ళబడకుండా ఉండాలని చూస్తున్నాను. అంతే." అన్నాడు. "అయితే మట్టుకు ఇప్పుడు పారిపోవటం భయపడి కాదా?" అన్నది అమ్మాయి. వాడు మాట్లాడలేదు. అమ్మాయి ఊరుకోక "ఎందుకండీ, అంత అభిమానం? మీ బావదగ్గర కూడాను. ఆయన వస్తున్నాడూ, ముఖం తప్పిస్తున్నానూ అని చెప్పరాదూ?" అన్నది.

"చెప్పే దేమిటి, బావకు తెలియదా? అది కాదు బావా, వారం రోజులలో ఇస్తానంటే వాడు ఎందుచేతనో ఆగటం లేదు. ఎప్పుడూ ఇల్లాగ కాదు. ఈతభా ఎందుచేతనో జీడిలాగ పట్టుకోని వదలకుండా ఉన్నాడు. అందుకని ఈ

నాలుగు రోజులూ వాడికి కాస్త కనపడకుండా ఉందామనే అనుకుంటున్నాను'' అన్నాడు మావాడు.

''అదా సంగతి? రెండున్నరకు ఆయన వస్తాడని ముందుగా వెళ్ళిపోతున్నావూ? అయితే ఒక్క సంగతి. ఆ వచ్చిన ఆయన నీవు వచ్చేటంతవరకూ ఇక్కడే కూర్చుంటాను అనకూడదు? అప్పుడేమిటి గతి?'' అన్నాను. ఇల్లా జరగవచ్చునని వాడికి అంతవరకూ తట్టలేదు కామాలు, ఈ మాట విని మా వాడు తెల్లపోయినాడు.

తెల్లపోయి, ''నిజమేను బావా! ఎట్లా వాడు అల్లా చేస్తే చెయ్యవచ్చు. ఒకతీరాన వదలటంలేదు. తీరా నేను అధికారిని వెంటబెట్టుకొని వచ్చేసరికి ఈ దరిద్రుడు తయారవుతాడు కామాలు'' అని అంటూ దిగాలపడి నుంచున్నాడు.

''ఆయనకు తోచకపోయినా నేను చెప్పి అయినాసరే కూర్చోబెట్టకపోతే చూడండి'' అని అమ్మాయి బెదిరించింది.

అమ్మాయి నవ్వుటాలకు అన్న ఈ మాట, వాడిని కష్టపెట్టింది. అందుకని వాడు విసుక్కొని ఏమీ జవాబు చెప్పలేక నావంక దీనంగా చూశాడు.

''ఏంరా, అల్లాగ దిగులుపడతావూ? అప్పులున్నయ్యి అని ఆయనకు తెలుస్తుంది. తెలిస్తే నీకు వచ్చిన నష్టం ఏముందీ? ఆయనకు మట్టుకు అప్పులు ఉండవా?'' అన్నాను.

"అల్లా క్కాదు బావా. నేను ఏదో డబ్బుగలవాడిని అయినట్లూ, ఘరానాగా బతుకుతున్నట్లూ ఆయనకు మొదట్లో అభిప్రాయం కలుగజేశాను. ఇప్పుడు ఈ విధంగా నా బతుకంతా బయటపడ్డదా నాకు మర్యాద ఉండదు!" అన్నాడు.

ఈ మాటమీద అమ్మాయి అన్నది .."అయితే మీబావ ఏం జేస్తారూ, మీరే ఉండి, ఆయనకు ఏదో మంచి మాట చెప్పి పంపించి మరీ వెళ్ళండి."

ఈ సలహా మా వాడికి నచ్చలేదు. అందుకని వాడు నాతో అన్నాడు. "అదికాదు బావా, నేను కనపడితే ఆయన వదలడు. నువ్వే ఏదో కాస్త మంచిమాట చెప్పి పంపివేయాలె." ఆ అనటంకూడా బతిమలాడే పద్ధతిలో అన్నాడు.

"సరేలే, నే నేదో చెప్పి పంపిస్తానులే. నీవు వెళ్ళు" అని మావాడ్ని పంపించాను. వాడు వెడుతూ "బావా, నీ కవిత్వం అంతా ఉపయోగించి ఈపీడ వదిలించాలె సుమీ నేను నాలుగున్నర కల్లా మా అధికారితో వస్తాను" అని చెప్పి భార్యతో, ఫలహారం కాఫీకూడా సిద్ధంచేయమని పురమాయించి వెళ్ళిపోయినాడు.

నేను కాస్సేపు పడుకొని, విశ్రాంతి తీసుకొని వాకిట్లోకి వచ్చేసరికి ఒకాయన మాయింటికి వస్తున్నాడు. అప్పుడు మూడు అయింది. ఆ వచ్చే ఆయన నల్లగా పొట్టిగా

ఉన్నాడు. బట్టలు మాసి ఉన్నయి. మూడు కాలేదు, అప్పుడే వస్తున్నాడు. పడిపోయినట్లు అనుకొని చూస్తూ, నిలుచున్నాను. ఈ షాహుకార్లు ఎండా వానా అని చూడరు ఎప్పుడు బడితే అప్పుడు వస్తారు. నిద్రాహారాలు ఉండవు కాబోలు. ఇల్లా అనుకుంటూ అక్కడే నిల్చున్నాను.

ఆయన యకాయకీని సరిగ్గా గడపలోకివచ్చి, నన్ను తేరిపార జూచి "నారాయణమూర్తిగారు ఉన్నారాఅండి!" అని అడిగాడు. "లేరు"

ఈ మాట విని ఆయన నిలువునా నీరై పోయినాడు. ఆకాశం విరిగి మీద పడ్డట్లు నిర్ఘాంతపోయి నిలబడ్డాడు. అనుకున్న సమయానికి పైకం అందకపోతే కొంప కూలినట్లు నటించటం వర్తకులకు ఉండే సహజగుణమే కదా అనుకొన్నాను. తన సొమ్మంతా హఠాత్తుగా సముద్రంలోమునిగిపోయినవాడు సహితం అంత ఏడ్పుముఖం పెట్టడు. ప్రాణం మీదికి వచ్చిన వాడిలాగ గుడ్లు తేలేశాడు. వాటర్ లూ యుద్ధంలో ఓడిపోయిన నెపోలియన్ సహితం అంత బేజారై ఉండడు. ఆయన్ను జూస్తే నాకు పరమ అసహ్యం వేసింది.

కాస్సేపటికి ఆయన తెప్పరిల్లి "ఎక్కడికి వెళ్లారండీ?" అని అడిగాడు. "బైటికి వెళ్ళాడండి" అన్నాను.

ఆయన ఒక్కక్షణం అల్లాగేనిలబడి చివరకు "ఎక్కడకు వెళ్ళి ఉంటాడండి? నేను వస్తానని ఆయనకు తెలు

సునే, ఎందుకు ఇల్లాగ వెళ్ళిపోయినాడో'' అని తనలో తాను అనుకొన్నట్లు అనుకొని, మళ్ళీ ఏదో జ్ఞాపకం వచ్చిన వాడి లాగ చూచి ధైర్యంతో ''సరే లెండి. ఇంకా కాసేపట్లో వస్తా డనుకొంటా'' అని జేబు గడియారాన్ని పైకి తీస్తు న్నాడు.

''మీరువస్తా రని తెలిసే, మీకు కనపడకుండావుండా లనే వెళ్ళిపోయినాడు''అని గబుక్కున నోరుజారి అనేశాను. అన్న తరువాత విచారించాను. అయ్యో ఎందు కంటెనా, అనవసరంగా పెద్దమనిషి మనస్సునొప్పించానే అని.

పాపం ఆయన తెల్లపోయి. ''ఎందుకండీ, ఏమంత ఖర్మం! అంత పారిపోవలసిన అవసరం ఎమీ లేదే!''అన్నాడు. ''భయం కాదుటండీ, అప్పులవాళ్ళను చూచినా అధికారు లను చూచినా అని నే నన్నాను. కాని ఆయన ఏమీ తృప్తి పడ్డట్టు కనపడలేదు. పైగా ఆయన ఆహ్వానం లేకుండానే లోపలికివచ్చేసి కుర్చీలోకూర్చున్నాడు. మావాడు భయ పడ్డంతా అయింది. ఇక ఆయన వదిలేటట్టు లేదు. మీరు వెళ్ళండినేను తలుపు వేసుకొంటాను, అని అంటానికి నాకూ నోరురాలేదు. నేనూ మరోకుర్చీలో కూర్చుని, పేపరు చదు వుతూ ఉన్నట్లు నటిస్తూ, ఈయనను సాగనంపటానికి మార్గం ఏదా అన్న ఆలోచనలోకి దిగాను.

బల్లమీద పుస్తకాలూ, పత్రికలూ, అవీ చాలా ఉన్నాయి. ఆయన ఒక ఇంగ్లీషు మాసపత్రికను లాగి పేజీలు

తిరగేసి, చివరకు ఏదో చదువుతూ ఉన్నట్లు చూడటం మొదలు పెట్టాను. మొదట ఆయన బొమ్మలకోసం పేజీలు తిరగేశాడు అనుకొన్నాను గాని చివరకు ఆయన ఏదో చదువుకొన్నట్లు తోచింది. ఏదో మూడో ఫారందాకా చదువుకొని ఉంటాడు. పైకి చదవండి, నేనుకూడా వింటాను అని అందామని అనుకొని మరీ ఏడిపించినట్లు అవుతుందని ఊరుకొన్నాను.

నేను అనుకున్నట్లే అయింది. ఆయన చదువుతూ ఉన్నట్టు నటనచేస్తున్నాడని తేలిపోయింది. ఎందుకంటే, పది నిమిషాలు కాకముందే, ఆయన పుస్తకాన్ని బల్లమీద పెట్టి పైకీ, కిందికీ, చూడటం సాగించాడు. ముందు ఆయన దూలాలూ, అడ్డకడ్డీలూ, లెక్క జూచుకొన్నాడు. దాని తర్వాత దర్వాజాలు లెక్కేసుకొన్నాడు. ఆపైన కిటికీలు ఎన్ని అయిందీ, ఒక్కొక్క కిటికీకి యెన్నిచువ్వలు ఉన్నదీ కూడా చూచుకొంటూఉంటే నాకు నవ్వొచ్చింది.

కాసేపు ఇల్లాగ చూచి, పాపం, ఆయన చివరకు నావంక జాలిగా చూస్తూ అడిగాడు. ‘‘ఏమండీ, ఎక్కడికి వెడతా నని చెప్పి వెళ్ళాడండీ ?’’అని. అల్లాగ అడుగుతూ ఉన్న పెద్దమనిషికి (బియ్యపువర్తకు డయితేనేం!) మర్యాదగా జవాబు చెప్పకపోవటం తప్పు అని తోచింది నాకు. అందుకని ఈతభా నేను మర్యాదగానే జబాబు చెప్పాను. ‘‘ఆంధ్ర ఇన్‌స్యూరెన్సు హాలులో ఏదో టీపార్టీ ఉందని వెళ్ళాడండీ ?’’ అని.

''ఎన్నిగంటలకండీ. ఆటీపార్టీ'' అని అడిగాడు ఆయన. ఏమో నాకు తెలియదండీ అన్నాను నేను. ఆయనకు నేను వస్తానని తెలిసే! ఎందుకు వెళ్ళాడబ్బా! అని గొణుక్కొని అయితే, ఎప్పుడు వస్తాడని మీ అభిప్రాయం ? అని అడిగాడు.

దొరికాడురా అనుకున్నాను. ఆయనను పంపివేయటానికి ఏదోమాట అనవలసిన సమయం అదేనని నిశ్చయించుకొని ఎప్పుడొస్తాడో చెప్పలేమండి. రాత్రికేగాని ఈ మధ్య రాడు. అదైనా రాత్రి పదకొండింటికి వస్తాడు, రావటం అంటూ ఉంటే. ఒకప్పుడు అదీలేదు. నమ్మకం చెప్పలేము. ఒక్కొక్కరోజున ఇంటికి రానేరాడు, అన్నాను ఒక్క గుక్కలో.

ఈమాట వినికూడా ఎందుకు కూర్చుంటాడు ఎంత మొండివాడైనా ? ఇక లేచిపోతాడు గదా అనుకొంటూ ఆయనవంక చూస్తూ కూర్చున్నాను. ఆయన ముఖంచూస్తే లేచిపోదామని నిశ్చయానికి వచ్చినట్లే కనపడ్డది.

ఆశ్చర్యపడుతూ పరధ్యాన్నంగా కాసేపు కూర్చుని ఆయన మళ్ళీ అడిగాడు.''ఏమండి, అయితే యింట్లోఆయనకు భార్యాబిడ్డలు లేరా ?'' అని.

''లేకేమండి ? ఉన్నారు. ఉంటే ఏం ? వాడికి భార్యా పిల్లలసంగతి పట్టిందీ ?'' అన్నాను నేను బొత్తిగా వాడు చెడిపోయినాడని చెప్పలేక చెపుతున్నట్లు.

నామాటలువిని ఆశ్చర్యపడి అడిగాడుమళ్ళీ. "అయితే, ఆయన ఉద్యోగంలో ఉన్నాడుగదా; ప్రొద్దున్నే లేచి ఆఫీసుకు వెళ్ళవద్దా? ఇల్లాగ అయితే, ఆఫీసులో పనిచేయటానికి ఓపిక ఎక్కడనుంచి వస్తుందండీ?" అని.

"ఆఫీసు పట్టిందిటండీ ఆయనకూ? ఎప్పుడో చేరుతాడు ఆఫీసుకు ఏపదింటికో, పదకొండింటికో."

"అయితే పూర్వపు మనిషి కాదన్నమాట!"

"ఎబ్బే, పూర్వపు మనిషి కానేకాడు. అంతా కొత్త సిరస్తా మారిపోయినాడు. బొత్తిగామారిపోయినాడు. ఇంటి దగ్గర పెళ్ళాం ఒకటేతీరాన మొత్తుకొంటున్నది, పెందరాళే కొంపకు చేరుకోమని."

"అయితే ఉండి ఏమీలాభంలేదన్నమాట?" అంటూ ఆయన లేచినిలబడి నావంక చూశాడు. నేను తల గట్టిగా ఊపుతూ "ఉహూ, ఏమాత్రం లాభం లేదు. అసలు వస్తాడో రాడో కూడా చెప్పలేము" అన్నాను.

ఇక ఉండి లాభం లేదని ఆయనకు గట్టిగాతోచింది. లేచి నిలబడ్డాడు. గుమ్మంలోకి వెళ్ళాడు. మళ్ళీ వెనక్కు తిరిగి "అయితే మీ కేమాతాడు ఆయన?" అన్నాడు. నేను విచారపడుతూ "మా బావమరదే నండి. చెప్పుకోటం సిగ్గు కూడాను!" అన్నాను. "ఉఁహు. అల్లాగుటండీ. మీ ఇంట్లో ఆయన అద్దెకు ఉన్నాడేమో, మీకూ, వారికీ పోట్లాటలు ఉండటం మూలాన అల్లా అంటూన్నారేమో అన్న సందేహంకూడా ఉండ నక్కరలేదన్నమాట!" అని

వినపడీ వినబడనట్లు గొణుక్కుంటూ మెట్లు దిగి, నేను వెడతా-అన్నాడు.

నేను నవ్వుతూ, వెళ్ళడమే మంచిది. కూర్చుని ఏమీ లాభం లేదు. పైగా మీపనులు నష్టం! అన్నాను. ఆయన ముందుకు నడిచాడు.

వెనకనుంచి నేను, మీ రేమీ తొందర పడకండి. వాడితో చెప్పి అన్నివిషయాలూ నేను సద్దుబాటు చేస్తాను, అన్నాను. ఆయన నావంక వికారంగా చూచి నవ్వుకొని ముందుకు సాగినాడు.

3

ఆయనను అట్లాపంపించి, మాకాంతం, నేనూ, మా వాడి భార్యా అంతా కూర్చుని నవ్వుకొన్నాము. జరిగిన సంభాషణ అంతా వాళ్ళకు పూసగుచ్చినట్లు చెప్పాను. ఎన్ని అబద్ధాలు చెప్పారండి, మాతమ్ముడ్ని గురించి అన్నది మా ఆవిడ. ఒక్కొక్క సమయంలో, అల్లాగ అబద్ధమాడక తప్పదు, అని నేను సమాధానం చెప్పాను. ఎల్లాగోలాగు పీడ వదిలించుకొన్నాం గదా అని సంతోషించాము మేము.

ఓనిమిషం అయిందో, లేదో, ఎందుకో ఉత్తరపు కిటికీలోనుంచి తొంగిచూశాను. దగ్గరలో అర్ధపర్లాంగు దూరంలో ఉన్నాడు మావాడు. ఇంకెవరితోనో ఇద్దరితో కలిసి వస్తున్నాడు.

మా బావమరిది భార్యకూడా తొంగిచూచి, "వస్తున్నారండీ అదుగో...తలగుడ్డ పెట్టుకొని దర్జాగా నడుస్తున్నాడో కాయన, ఆయనే కామాలు అధికారి! అట్లా ఉన్నాడేం ఉసురోమంటూ ?" అన్నది. అధికారులు అట్లాగే ఉంటారమ్మా అని నేను అన్నాను. లేచి మళ్ళీ కిటికీలోనుంచి చూశాడు. అమ్మాయి అన్నమాటనిజమే. ముగ్గురూ వస్తున్నారు. జవాను పెట్టె నెత్తిన పెట్టుకొని ముందు నడుస్తున్నాడు. జవాను వెనకాల అధికారి, ఆ వెనకాల మావాడూ కనిపించారు.

అధికారి వస్తున్నా డని నిశ్చయించుకొనేసరికి ఈ బియ్యపు వర్తకుడు ఇంకా అక్కడే ఉన్నాడేమో నని సందేహం వేసింది. తలుపు తీసి చూశాను. అక్కడే శని గ్రహంలాగ నిలబడి ఉన్నాడు వాళ్ళవంక చూస్తూ.

అధికారి ఎదటే తన బాకీ విషయమై మావాడిని నిలవేసి అడుగుతాడేమో నని భయం వేసింది. అందుకని గబగబా వీధిలోకి పోయి, ఆయన్ను వెనక్కు పిలిచి "చూడండీ, మావాడున్నూ, వాడున్న బ్యాంకి అధికారిన్నీ వస్తున్నారు. మీరు బాకీ సంగతి ఇప్పుడేం ఎత్తకండేం!" అని బ్రతిమిలాడాను.

"అబ్బే ! ఆమాత్రం నాకు తెలియదుటండీ? వస్తున్నారుకదా, ఒకమాటు కనపడి నమస్కారం చేసి వెడదామని నుంచున్నాను" అంటూ ఆయన వెకిలిగా నవ్వాడు.

"మిం బాకీ, వారం రోజులలో తీర్చే ఏర్పాటు నేను చేస్తాను. మీరు వెళ్ళిపోండి" అని ఇంకోమాటు ఆయనకు గట్టిగా, చెప్పి, నేను గబాగబా ఇంట్లోకి వచ్చేశాను. కుర్చీలూ అవీ సద్దటానికి.

పెద్దమనుష్యులను రిసీవ్ చేయటానికి తగినపద్ధతిలో కుర్చీలుసద్ది వాకిట్లోకి వెళ్ళేసరికి మావాడు ఎదురై గబగబా నడుస్తూ ఒక్క గుక్కలో-వచ్చారు బావా-అంటూ లోపల అడుగు పెట్టాడు. నేను అక్కడే నుంచుని ఆ వర్తకుడివైపు తిరిగి వెళ్ళండి అని సంజ్ఞ చేశాను.

నామాట వినకుండా ఆయన మళ్ళీ ఇంట్లోకి ప్రవే సిస్తూ మావాడ్ని అడిగాడు. రమ్మంటారా అని. మావాడు ఆయనకు ఎదురుగా వెళ్ళి, వినయంగా నమస్కరించి, "నేను తమకోసం రైలుదగ్గరకు వెళ్ళాను. మీరు కారులో ముందుగా వచ్చారని గుమాస్తా చెప్పిందాకా నాకు తెలియనే తెలి యదు" అన్నాడు.

తమరు వచ్చి చాలాసేపు అయిందా ఏమి టండీ! క్షమించండి, అంటూ ప్రాధేయపడటం చూచి నేను నిర్ఘాంత పోయినాను. స్టేషనునుంచి మావాడితో వచ్చింది గుమాస్తా. అనీ, ఈయనే అధికారి అనీ అప్పటికి నాకు తెలిసింది. నిలువునా నీరై పోయినాను. నోటమాట రాలేదుకూడా.

నేను ఆ స్థితిలో ఉండంగానే మావాడు ఆయనను నాకు ఎరుకపరచాడు. నేను ఆయనకు షేక్ హాండ్ ఇవ్వా

ల్సింది మరిచిపోయి కలయో, వైష్ణవమాయయో అన్న స్థితిలో ఉన్నాను. ఆయన నా చెయ్యి పట్టుకొని గట్టిగా ఊపి "మీ బావగారు, వీరేనా? పేరు విన్నాను, ఎప్పుడూ చూడలేదు" అని గట్టిగా నవ్వాడు.

అమ్మాయి తయారుచేసిన ఫలహారాలూ, కాఫీ, ముందుకు వచ్చినై. అందరూ సంతోషంతో కానిస్తున్నారు. నేను అయోమయస్థితిలో ఉన్నాను. ఆయన కులాసాగా ఏవో ప్రశ్నలు అడుగుతున్నాడు. మావాడు ఏదో వినయంగా సమాధానాలు చెబుతున్నాడు. నాకు మాత్రం ఆనందంగా లేదు. ఏదో గొప్ప తప్పు చేసినవాడిలాగ నేను బాధ అనుభవిస్తున్నాను. చివరకు ఆ అధికారి మావాడివంక తిరిగి "ఏమయ్యా, నీవు టీ పార్టీలకూ వాటికీ తరుచు వెళ్ళుతూ వుంటావా?" అని అడిగాడు. ఈ అడగటం మామూలు ప్రశ్న అడిగినట్లు లేదు. ఏదో ఎత్తిపొడుపు మాటలాగ ధ్వనించింది.

"ఎప్పుడైనా వెళుతూ ఉంటానండి! ఇవ్వాళ రెండు గంటలకు ఓ టీపార్టీకి వెళ్ళాను. అక్కడినుంచే యకాయకీని స్టేషనుకు వచ్చేశానండి" అన్నాడు మావాడు.

"అది సరే కొంపా గోడీ, ఏమీ పట్టించుకోకుండా తిరుగుతూ ఉంటావుటగా?" ఈ ప్రశ్నలో కొంచెం వేడి ఉన్నట్లు తెలిసిందిమాకు.

"ఎబ్బే, లేదండీ" అంటూ మావాడు తెల్లపోయినాడు. "లే దనబోకు. రాత్రిళ్ళు నీవు ఇంటికి రావనీ,

వచ్చినా ఏ ఒంటిగంటకో, వస్తావనీ, నాకు తెలుస్తున్నది.'' అని అన్నా డాయన తీవి, దర్జా, ఉట్టిపడుతున్న కంఠ స్వరంతో. నాకు భయం వేసింది. అవమానంతో కుంగి పోయి నాను.

''వట్టి అబద్ధం అండీ! ఎవరండి ఇల్లాంటి సంగతులు మీకు చెప్పింది? దుర్మార్గం, లేని పోనివి అల్లాగ చెప్పటం కేవలం దుర్మార్గం'' అని మావాడు గోల పెట్టాడు.

ఆ బ్యాంకి అధికారి వాడివంక ఇంకా కొరకొరా చూస్తూ ''దుర్మార్గంనీదిలాగ కనపడుతున్నది. నిన్ను గురించి ఇల్లాగ చెప్పింది బజారు మనిషి కాదు. చాలా పెద్దమనిషి'' అన్నాడు తీవిగా.

''ఎవరండీ ఆ పెద్దమనిషి! నన్ను గురించి నా అధికారులతో ఇల్లాంటి అబద్ధాలు చెప్పినవాడు ఎల్లాంటి పెద్ద మనిషో చూస్తాను, ఆయనను నా ఎదటకు తీసుకురండి'' అని మావాడు విసుగ్గా అన్నాడు.

''ఎదుటకు తీసుకురావటం ఎంతసేపు! కాని ఇల్లాగ ఇల్లు పట్టకుండా తిరుగుతున్నావే, ఆఫీసు పనులు నిలకడగా చేస్తావని ఎల్లాగ నమ్మకం?'' ఈ మాటలు ఆయన అధికారి లాగా అన్నాడు.

మా వాడు కలతపడ్డాడు. తొణికిపోయి, ''వట్టిదండి. ఆ చెప్పిన ఆయనను పిలిపించి న్యాయం విచారించాలి,'' అని ప్రాధేయపడ్డాడు.

నాకు ఏంజేయాలిసిందీ తోచలేదు. అంతకు పూర్వం నేను చెప్పినవన్నీ అబద్ధాలు అని ఒప్పుకొంటే నేను అధికారి దృష్టిలో వట్టిమర్యాదస్థుడిని అయిపోతాను. కాదు, నేను చెప్పిన దంతా నిజమే నని నిలవతొక్కుకుంటే మా వాడి మీద ఆయనకు కోపంరావచ్చు. అందుకని ఏమీమాట్లాడ లేక ఊరుకొన్నాను.

చివరకు ఆయన మావాడిని అడిగాడు, "నిన్ను గురించి ఈ మాటలన్నీ నాకు చెప్పింది ఎవరో తెలుసునా?" అని.

మావాడు మాట్లాడ లేదు, "ఇదుగో ఈయనే మీ బావగారే!" అని నావంక చూపాడు.

పిడుగు పడ్డట్లు అయింది, మావాడు నిర్ఘాంతపోయి నావంక వెర్రిగా, జాలిగా, చూశాడు. నేనే కాస్త ధైర్యం తెచ్చుకొని "ఒక్క పొరపాటు జరిగిందండి. మిమ్మల్ని..."

అని ఏదో చెప్పవస్తుంటే ఆయన నామాటకు అడ్డొచ్చి "నాకు తెలుసులెండి మీరు పొరపడటం నేను గ్రహించక పోలేదు. ప్రయాణంలో మాసిపోయిన బట్టలూ, నేనూ, పెద్ద మనిషి అని అనుకొనే స్థితిలో లేక పోవటంమూలాన మీరు పొరపడ్డారు. అయినా ఒకరితో మట్టుకు లేనిపోని అబద్ధా లన్నీ చెప్పటం తప్పుకాదండీ?" అన్నాడు.

"తప్పేనండి పొరపాటు అయిపోయింది." అని నేను నొచ్చుకొన్నాను. ఆయన విరగబడి నవ్వాడు.

కాసేపు అయినతరువాత నవ్వు ఆపుకొని అన్నాడు: "ఇల్లాగ మీరు అబద్ధాలాడటం ఇది మొదటిసారి కాదు. నేను చాలారోజులనుంచీ చూస్తున్నాను. మీరు వ్రాసిన దంతా చదువుతున్నాను. మహాకవికంటే ఎక్కువగా అబద్ధా లాడుతున్నారు" అన్నాడు.

ఈ మాటలు విని నేనేమీ మాట్లాడలేక పోయి నాను. ఆ తరువాత ఆయన మావాడివంక తిరిగి కోపంగానే చూస్తూ "అయితే నీవు బ్యాంకిలో ఉద్యోగం చేస్తూ ఊళ్ళో బాకీలు చేస్తున్నావు! బాగుందా ఇది!" అన్నాడు. "ఎబ్బే! ఎక్కడా బాకీలులేవండి. ఒక్క బియ్యపువర్తకుడకే యాభై ఇవ్వాలె. నాకు రావలసిన సొమ్ముకూడా చూస్తే ఈ బాకీ ఒక లెక్కలోది కాదని తమకు తెలుస్తుంది. నాకు పొలాల మీద రావాల్సిన రెండువందల రూపాయలు రైతులు ఇంకా తెచ్చి ఇవ్వలేదు. ఆ సొమ్ముకోసమే చూస్తున్నాను. ఈ వారంలో తప్పక వస్తుంది. రావటంతోనే ఈ బాకీ తీర్చేస్తా నండి." అని మావాడు వినయంగా సమాధానం చెప్పాడు.

ఈ సమాధానం విని ఆయన ఏమాత్రం తృప్తిపడ్డట్లు కనిపించలేదు. అయిన్నూ, ఏదో సందేహం బాధిస్తున్నట్లు స్పష్టంగా, కనిపించింది. ఏదో ఆలోచిస్తున్నాడు. ఎందుకో విసుక్కొన్నట్లుంది.

ఆయనవైఖరీ చూస్తే నాకూ భయంవేసింది. ఆయన అన్నమాట నిజమే! బ్యాంకిలో ఉద్యోగం చేస్తూ, ఊళ్ళో

అప్పులు చేయుటం తప్పే. దీన్ని మనస్సులో పెట్టుకొని ఆయన మావాడికి ఏదైనా అపకారం చేస్తాడేమో నన్న భయం చాలా బాధ పెట్టింది. నేనుచేసిన పొరపాటువల్ల కదా ఇంత అవస్థ వచ్చిందీ అనుకొని కష్టపడ్డాను. మావాడూ విచారపడుతున్నాడు. అధికారీ విచారపడుతున్నాడు.

౪

ఇంతలో ఎవరో ఒకాయన చేత్తో ఒక పుస్తకం పట్టుకొని వచ్చి, గుమ్మంలో నుంచున్నాడు–ఎవరో చాలామంది ఉన్నారూ మనం వెళ్ళటం బాగుండదు–అని ఆయన అనుకొని ఉంటాడు. లేకపోతే అంతసేపు గుమ్మంలో నుంచోవలసిన పని లేదు. ఆయన వాలకం చూచి బియ్యపు వర్తకుడు ఆయనే అనుకొని మావాడి వంక చూశాను. వాడు మొదట ఆశ్చర్యపడి తరువాత తెల్లపోయినాడు. ఆ అధికారి నావంక ఓసారీ మావాడివంక ఓసారీ చూచి ఆ క్రొత్తగా వచ్చింది ఎవరైందీ గ్రహించాడు.

ఎవరికోసం? అని అధికారి ఆ క్రొత్తగా వచ్చిన ఆయనను అడిగాడు. పంతులుగారికోసం అంటూ ఆ వర్తకుడు మా బావమరిది వేపు చెయ్యి చూపాడు. దాంతో అందరికీ స్పష్టంగా తెలిసిపోయింది ఆయన ఎవరు అయింది.

ఎల్లాగూ అందరికి తెలిసిన విషయమే కదా, ప్రత్యేకంగా జరగబోయే ప్రమాదం ఏమీలేదు అనుకొని నేనే

ఆయనను కూర్చోమని కుర్చీ చూపించాను. ఫలహారం ముందుపెట్టి కాఫీకూడా ఇచ్చాను. ఆయన నవ్వుతూ కూర్చు న్నాడు. మావాడుమట్టుకు పది లంఖణాలు చేసి, ఆ రోజునే పథ్యం పుచ్చుకొన్నవాడి ముఖం పెట్టాడు. ఆయన బియ్యపు వర్తకుడూ, డబ్బు అడగటానికి వచ్చాడూ అన్న సంగతి గ్రహించినప్పటినుంచీ, ఆ అధికారి నిప్పులు కక్కుతున్నాడు.

నేను ఈ విచిత్రసంఘటనను గూర్చి ఆలోచించటం మొదలు పెట్టాను. అధికారిని అనుకొన్నట్లు గౌరవించ లేక పోయినాను. కటువుగా మాట్లాడి పంపేద్దా మనుకొన్న షావుకారుకు కుర్చీ యిచ్చి గౌరవించాను. మనం అను కొన్నది అనుకొన్నట్లు జరగక వ్యవహారం తలక్రిందు లౌతుం టుంది గదా అనుకొంటూ కూర్చున్నాను.

మావాడు ఏమీ మాట్లాడలేదు. నిశ్చేష్టుడైపోయి నాడు. తలవంచుకొని కాఫీ తాగుతున్నాడు. అధికారి కప్పు చేత్తో పట్టుకొని కాఫీతో పాటు కోపాన్నికూడా కొంచెం కొంచెంగా మింగుతున్నాడు.

బియ్యపువర్తకుడు తనబాకీసంగతి ఏమీ ఇంతవరకూ తేలేదు. ఊరికే నవ్వుతూ కాసేపు కూర్చుని మావాడిని పలకరించి "మీరు మీబావగారా?" అని నన్ను చూపుతూ అడిగాడు. అవునని మావాడు తల ఊపాడు. బ్యాంకు అధికారివంక చూస్తూ "వారు బంధువులా?" అని ఇంకో

ప్రశ్న వేశాడు. కాదు. మన బ్యాంకీ అధికారులని మూవాడు చెప్పాడు. షాహుకారు విని ఆశ్చర్య పోయి. అల్లాగాఅండీ. నమస్కారం, అంటూ వినయం కనపర్చాడు.

నలుగురిలో బాకీ సంగతి ఎత్తకపోవడంవల్ల షాహుకారు మే మనుకొన్నంత చెడ్డవాడు కాడని తేలింది. అధికారి మట్టుకు కోపంగానే ఉండి చివరకు మూవాడివంక తిరిగి, ''వీరు ఎవరు?'' అని అడిగాడు షాహుకారును చూపిస్తూ.

''భియ్యపు వర్తకులు.''

''ఎంత బాకీ వీరికి నువ్వు?''

''యాభై రూపాయలు.''

''అప్పు చేశావటయ్యా? నీకు బ్యాంకిలో ఉద్యోగం ఏమిటి, ఊళ్ళో బాకీలు ఏమిటి? ఏమీ బాగుండ లేదు. ఇల్లాగ చేస్తివా నీ ఉద్యోగానికి నీళ్ళొదులుకోవాల్సి ఉంటుంది.'' అన్నాడు ఆ అధికారి ప్రతిమాటా తన దర్జాకు తగిన ఊపుతోనూ నొక్కుతోనూ. వర్తకుడిఎదుట తనదర్జా చూపటానికి ఆ అధికారి ఈమాటలు అనిఉంటాడు. లేకపోతే ఇదివరలో ఒకసారి ఇల్లాగ అనికూడా, మళ్ళీ ఇప్పుడు అనడం అవసరంలేదు.

''తీర్చివేస్తానండి వారం రోజులలో'' అన్నాడు మూవాడు.

"తీరుస్తా వనుకో. ఐనా నీవు అప్పు చేయకూడదు. అసలు ఈ విషయం నాచెవిని పడకుండా ఉండవలసింది. పడ్డ తరువాత దీని విషయమై యాక్షన్ తీసుకోక తప్పదు" అని కఠినంగా అన్నాడు అధికారి.

మావాడు ఏదో చెప్పలేక బాధపడుతున్నాడు. దీని కంతా కారణం నేను చేసిన పొరపాటుగదా అని నేనూ విచారపడుతున్నాను. నా చెవిని ఎందుకుపడ్డదా ఈ విషయం అని ఆ అధికారీ లోపల విచారపడుతున్నట్లు ఊహించ వచ్చు.

షాహుకారుకు మట్టుకు ఈ గొడవ ఏమాత్రం తెలియ లేదు. కొంతసేపటిదాకా అధికారి అన్న కఠినవాక్కులు విని ఆయన ఉలిక్కిపడ్డాడు. పాలిపోయిన మొఖంతో ఆ షాహు కారు ఆ అధికారివంక తిరిగి అన్నాడు.

"ఏమండీ, పంతులుగారూ, నాకు బాకీ వున్నారన్న విషయాన్ని గురించేనా తమరు మాట్లాడుతున్నది ?"

"అవును. నీ బాకీ విషయమే."

"ఆయన నాకు బాకీ వున్నారని తమకు ఎవరు చెప్పారు ?"

"ఎవరు చెపితే ఏం ? ఆయన బావగారు చెప్పారు."

"పట్టి అబద్ధం అండి, ఆయన చెప్పింది. ఆయన మాటలే నమ్మారూ !" అన్నాడు షాహుకారు దీర్ఘాలు దీస్తూ.

నాకు చచ్చినచావు అయింది. ఏదుకూడా నే నేదో అబద్ధం కల్పించి చెప్పాననేసరికి, పాపం అధికారే నాపాలిటి దేవుడై ఆ కాస్తమాటా నిలవదీసి అడిగాడు. "ఆయన అబద్ధం ఆడుతున్నాడు అంటూ వేమయ్యా ? నారాయణ మూర్తిగారు మట్టుకు అనటంలేదా బాకీ వున్నమాట నిజమేనని ?"

"పాపం పంతులుగారికి తెలియక చెప్పారు. వారు నాకు ఒక్క దమ్మిడీ అయినా బాకీలేరు" అన్నాడు షాహు కారు.

అందరం పిచ్చిచూపులు చూశాము. షాహుకారుకు ఏమన్నా పిచ్చి ఎక్కలేదుగద అనుకొన్నాను. ఒక్కక్షణం అయినతరువాత మాకు ఒకటి తోచింది. మావాడి ఉద్యో గానికి మొప్పం వస్తుందని షాహుకారు ఎత్తిన ఎత్తు ఇది అనుకొన్నాము; అనుకొని సంతోషించాము. అధికారిమట్టుకు ఈ మాత్రం ఊహించలేడా ? ఊహించి కూడా ఏమీ అన లేక ఊరుకొన్నాడు. ఎవ్వరం ఏమీ మాట్లాడలేదు.

నిశ్శబ్దం. ఎంతసేపు ? అరనిమిషం. ఇంతలో అధికారి; ఏదో జ్ఞాపకం వచ్చినవాడిలాగ చివుక్కున విసురుగా తల యెత్తి షాహుకారువంక చూస్తూ "నీకేం బాకీ లేనే లేదా ? ఏదీ పుస్తకంలో జమ వుందేమో చూడనీ"

అన్నాడు. మంచి ప్రశ్న. అధికారికూడా చాలా తెలివైన వాడు అనుకొన్నాము.

వర్తకశిఖామణి ఎత్తిన ఎత్తు గొప్పదే. కాని అధికారి ఇల్లాగ పుస్తకం చూపమనిఅడుగుతాడని వూహించిఉండడు. అందుకని కాపీ చేస్తుండగా పట్టుబడ్డ స్కూలుకుర్రాడులాగ తెల్లముఖం వేస్తాడని అందరం ఒక్కసారి అటు చూశాము.

వర్తకుడు తెల్లముఖం వెయ్యలేదు. ధైర్యంగా, నిశ్చలంగా చూడండి కావలిస్తే–అంటూ పుస్తకం ఆయనకు అందించాడు. నేనూ, మా వాడూ, అధికారీ, అక్కడున్న వాళ్ళం అందరంకూడా, ఆకాశంలోనుంచి, ఏదో, విచిత్ర వస్తువు కిందికి దిగుతూవుంటే, అది బాంబా, విమానమా. మనిషా, బొమ్మా ? అని ఎంత విస్మయంతో చూస్తామో అంత విస్మయంతో చూశాము ఆ పుస్తకంవంక.

అధికారి పుస్తకాన్ని ఇంకా సందేహంతోనే అందు కొని, పేజీ తీసి, తాను చదువుకొని నవ్వుకొన్నాడు. అసలు సంగతి ఏమిటో చెప్పకుండా ఆయన ఒక్కడే ఆనందించటం నాకు కష్టంగా ఉండి, ఊరుకోలేక—నిజమేనాఅండి ? జమ ఉందా?—అని అడిగాను ఆదుర్దాగా.

అప్పటికి ఆయన స్పష్టంగా జవాబు చెప్పక అవు నన్నట్లు తల ఊపాడు; నవ్వాడు. నవ్వి మావాడివంక చూశాడు.

ఆ తరువాత నన్ను జూచి నవ్వాడు. ఇల్లా నవ్వడం వల్ల నాకేదో సందేహం కలిగింది. జమఉంటే, ఉంది అని చెపితే సరిపొయ్యేది. ఆయన అట్లా చెప్పక ఊరికే అందర్ని జూచి నవ్వటం సాగించాడు.

అందరికీ ఏమైనా అర్థం అయిందా అంటే ఒక్కరికీ నిజం ఏమిటైందీ తెలిసినట్లు లేదు. అంతా ఆయనకు గుడ్లు అప్పగించి తెల్లపోయి చూస్తున్నారు.

ఎంత సేపని ఊరుకోగలను ? చివరకు నేనే నోరు చేసుకొని మావాడ్ని అడిగాను; "ఏంరా ఇచ్చి మరిచి పోయి నావా ఏమిటి"—అని

"ఎబ్బే నే నివ్వలేదు. బాగా జ్ఞాపకం. నేను డబ్బుకు సంబంధించిన విషయాలు ఎప్పుడూ మర్చిపోను—"అని వాడు ఘట్టిగా చెప్పాడు.

అందరం తెల్లపోయినాము. ఏమీ బాకీ లేకపోతే ఆయన అల్లాగ బాకీ కోసం తిరగటం ఎందుకు సంభవించింది? బాకీ ఉన్నట్లతే జమ ఎట్లా పడిఉంటుంది ! ఈ ప్రశ్నలకు సమాధానం ఏమీ తోచలేదు. పక్కా రెండు నిముషాల సేపు అందరం ఆ అధికారి వంక చూస్తూ కూర్చున్నాము.

ఈ పరిస్థితులు చూచి వర్తకుడు అప్పటికప్పుడు జమ కట్టటానికి ఏమాత్రం అవకాశంలేదు. అయినా తెలుసు కొందామని "జమ ఎప్పుడో చూడండి" అని అడిగాను అధి

కారిని. ఆయన నవ్వుతూ "సాహుకారు చేసిన మాయ ఏమి లేదు. ఇరవై రోజుల క్రింద జమ పడ్డది" అన్నాడు. ఈ తమాషా ఎట్లా జరిగిందో ఎవ్వరికీ తెలియలేదు.

"ఏమిటయ్యా ఈనాటకం?" అని నేను సాహుకారునే అడిగాను. ఆయన "పుస్తకంలో ఏమి రాసిఉందో పంతులు గారినే చదవమనండి తెలుస్తుంది" అన్నాడు.

అందరం అధికారి వంక తిరిగాము "చదవండి తొందరగా" అన్నట్లు చూస్తూ.

అధికారి "ఇక్కడ ఉన్నది చదువుతాను వినండి. ఈ బాకీకి గాను, నారాయణమూర్తిగారి భార్య ఇచ్చిన రొఖ్ఖం యాభై రూపాయలు, అక్షరాల యాభై రూపాయలు" అని చదివి ఊరుకొన్నాడు.

విస్మయం, ఆనందం తోసుకొన్నాయి మా హృదయాల్లో. అందరికంటె మావాడు ఎక్కువగా ఆశ్చర్యపోయినాడు. ఒక్క నిమిషం ఎవ్వరం రెప్పవాల్చలేదు. ఏవిధమైన శబ్దమూ చెయ్యలేదు. మరుక్షణంలో చీకట్లను చీల్చుకొని వచ్చిన మెరుపుల్లాగ అందరి ముఖాలపైన చిరునవ్వు మెరిసింది. మెరుపుల వెంట ఉరుములు, అందరు విరగబడి నవ్వారు.

అందరితోపాటూ మావాడునవ్వాడు మొదట. కాని వెంటనే వర్తకుడ్ని కొరకొరా చూస్తూఅడిగాడు; "ఏమయ్యా

సొమ్ము ముట్టిన తరువాత కూడా, ఆ సంగతి నాకు చెప్పక, అల్లాగ, కాళ్ళు అరగిపోయే లాగున తిరిగి సొమ్ము ఇమ్మని వేధించావు! నిజంగా బాకీ ఉన్నప్పుడు ఎప్పుడూ అడిగి ఎరుగవు! బాకీ లేనప్పుడు ఇల్లా బాధపెట్టావు. ఏమిటది?'' ఈ అనటం కోపంగానే అన్నాడు.

''ఇదివరకు అంటే నా స్వంత బాకీ కాబట్టి మీరు ఎప్పుడిచ్చినా పుచ్చుకొన్నాను. సొమ్ము అందటంతోనే మీరు ఇస్తారని ధైర్యం. ప్రత్యేకంగా అడగటం అవసరం లేక పోయింది. ఆరోజున ఏదో అవసరం వచ్చి అడగ్గానే, అమ్మాయిగారు బాకీ మొత్తం యావత్తూ నాకిచ్చి, మళ్ళీ ఆసొమ్ము యావత్తూ మీ వద్దనుంచి వసూలు చేయమని కోరారు. ఆమెగారు ఇచ్చారని చెబితే మీరుమళ్ళీ ఇయ్యరు. అందుకని ఆవిషయం మీకుచెప్పలేదు. కాని మీరు నాకు బాకీ లేకపోయినా ఆమెకు బాకీ పడ్డారు అమ్మాయిగారికి ఇవ్వాల్సిన సొమ్ముకోసమే నే నంతగా తిరిగింది. నాసొమ్ము కోసమైతే తిరగనే తిరగను'' అన్నాడు. అంతా విని నవ్వుకొని ఊరుకొన్నారు.

౫

సాహుకారు పాపం, అమాయకంగా, అధికారి మా వాడికి అపకారం ఏమైనా చేస్తాడేమోనన్న భయంతో

ఉన్నది ఉన్నట్లు చెప్పాడు. అందులో ఏమీ సందేహం లేదు. ఈ సంగతి అంతా విని అందరూ మరోసారి నవ్వుకొన్నారు. చాలా తమాషా అయిందనుకొన్నారు. అంతవరకు బాగానే ఉంది.

దాని తరువాత జరిగిన కథే నాకు కష్టం కలిగించింది. షాహుకారు సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయినాడు. అధికారి మావాడితో అన్నాడు: "నీవు ఏదో బాకీ చేశావని నాకు తెలియడం మూలాన, నేను స్నేహరీత్యా నిన్ను మందలించాను గాని మరోటిగాదు. పెద్దవాడిని కాబట్టి నీకు మంచి మాట చెప్పాను. నేను అన్నమాటలు మనస్సులో ఉంచుకోకేం!" అని.

మావాడు ఆయనతో "తమకేం తెలుసూ? అయినా తమరు అన్నది ఏమీ లేదు" అని నవ్వి ఊరుకొన్నాడు.

"నారాయణమూర్తిగారికి, పాపం, ఏమీ తెలియదు. భార్య బాకీ తీర్చిన విషయమూ తెలియదూ, ఆయన బావగారు ఈసంగతంతా తమకుచెప్పిన విషయమూ తెలియదు! పాపం ఆయన అనవసరంగా ఖంగారుపడటం సంభవించింది." అన్నాడు గుమాస్తా అధికారితో. అందరికీ వాడి విషయంలో సానుభూతి కలిగేలాగున, అందరూ వాడ్నిచూచి జాలిపడ్డట్లు చూపులు చెపుతూనే వున్నాయి.

అసలు ఈ గలాభాకు అంతా మూలకందం మావాడి భార్య. ఇట్లా సంగతి అని మాటమాత్రం అన్నా నాకు చెప్ప లేదు. ఇంత గ్రంథం జరుగుతూవుంటే ఊరుకోనివుందే కాని అసలు రహస్యం బయటపెట్టలేదు. ఆ అమ్మాయిని ఇదేమని ఒక్కరూ ఒక్కమాట అయినా అనలేదు. పైగా చాలా తెలివైంది అని మెచ్చుకొన్నారు.

ఇక మిగిలిపోయింది నేను. నా సంగతి ఒక్కరూ ఎత్త లేదు. "పాపం. ఈయన అన్యాయంగా ఫూల్ అయి పోయి నాడు" అని ఒక్కరూ-ఒక్కరైనా జాలి చూపలేదు.

వారి సానుభూతిని ఆసిస్తూ, చివరకు నేనే అన్నాను. ఇంతకూ, నేను మిమ్మలను చూచి వర్తకుడు అనుకోటం వల్ల, ఇంతగొడవ జరిగింది అనుకోండి. కాని ఇందులో నాతప్పు ఏమీ లేదు. అల్లాగ ఎందుకు అనుకోవలసివచ్చిం దంటే...అని చెప్పబోతుంటే, వాళ్ళు వినక, ఎల్లా సంభ విస్తే ఏం లెండి కథ నడిపారు. అని నవ్వారు ఈ గొడవంతా నేను కావాలని తెచ్చి పెట్టినట్టు.

మునిమాణిక్యం నరసింహారావుగారు

కాంతం కథకులనే పేరుతో ప్రసిద్ధులైన మునిమాణిక్యం నరసింహారావుగారు 1898 లో గుంటూరు జిల్లాలో సంగం జాగర్లమూడి గ్రామంలో జన్మించినారు. గుంటూరులోనూ, విజయనగరంలోనూ విద్యాభ్యాసం చేసినారు. (బి.ఏ.ఎల్.టి.) బందరు హిందూ కాలేజి హైస్కూలులో చాలకాలము చరిత్రోపాధ్యాయులుగా పనిచేసి రిటైరు అయి విశ్రాంతి పుచ్చుకొంటున్నారు.

మునిమాణిక్యంవారిని చూచి ముసిముసి నవ్వు నవ్వని ఆంధ్రుడు ఉండడు. వీరి రచనలు అన్నీ నవ్వించేవే! గృహ జీవితములోని కళాప్రసక్తములైన రసవద్వినోద కలాపాలను కథావస్తువుగా తీసుకొని ఇరవై అయిదు గ్రంథములు వ్రాసినారు. గార్హస్థ్య జీవిత సౌందర్యమును మనోహరంగా ఆవిష్కరణ చేసినారు. ఆంధ్రుల అభిమానకథకుడు. "కాంతం కథ వ్రాస్తే మునిమాణిక్యమే వ్రాయాలె. మునిమాణిక్యం వ్రాస్తే కాంతం కథ వ్రాయాలి" అన్నారు విమర్శకులు. వీరివలె సాంసారిక జీవితములోని రమణీయ దృశ్యాలను చిత్రించినవారు ఇంకొకరు లేరు.